

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలో సూపర్ హిట్. చంద్రబాబు నాయకత్వంలో రైతులు, వృద్ధులు సహా అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది. హామీల్లో 70% పైగా నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం ఇదేనని ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 06.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 142 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# పెట్టుబడులకు సహకరించండి

## రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సహకారం అందించండి

## ప్రధాని నరేంద్ర మోడీతో మంత్రి లోకేష్ మర్యాద పూర్వక భేటీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోడీతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు, రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం, ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మీ సహకారం, మార్గదర్శనం కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా మీ సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం, మీ నేతృత్వంలో వికసిత్ భారత్ - 2047లో భాగస్వాములం అవుతామని అన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీజీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించారు. ప్రధాని మోడీ స్పందిస్తూ... రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్ ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ బహుకరించారు.



# గురువులను మరువలేం

## నాలో స్ఫూర్తి నింపింది భక్తవత్సలం మాస్టారు..

## తల్లిదండ్రుల తర్వాత గుర్తుపెట్టుకునేది గురువులనే..

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## విజయవాడలో ఘనంగా గురుపూజోత్సవం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్‌లతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలను సీఎం పరిశీలించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్‌కు సీఎం సూచించారు. విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆంధ్ర వర్శిటీకి 4వ ర్యాంకు రావడం శుభపరిణామమని, ఇలాంటి ర్యాంకులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అలానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా నెలకొల్పిన గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు ముఖ్యమంత్రికి అందించారు.

గురుపూజోత్సవం చాలా పవిత్రమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల తర్వాత మనం గుర్తు పెట్టుకునేది ఉపాధ్యాయులనే అని, అలాంటి వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని అన్నారు. విద్యార్థి దశలో పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, అలానే మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువేనని తెలిపారు. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని, నేను నిత్య విద్యార్థిని ప్రతిరోజు ఏదో ఒకటి నేర్చుకుంటానని సీఎం వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం మనకు ఆదర్శప్రాయమని చెప్పారు. మిగతా 2లో...

# ఆందోళన చెందొద్దు



- ప్రభుత్వం అండగా ఉంది... చికిత్స పొందండి
- తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ పర్యటన
- వైద్య శిబిరంలో ఏర్పాట్లు, పరీక్షల వివరాలు తెలుసుకున్న సత్యకుమార్
- జీజీహెచ్‌లో తురకపాలెం వాసుల కోసం సకల సదుపాయాలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు

**గుంటూరు, తురకపాలెం (జర్నలిస్ట్ ఫైల్):** మేము సిద్ధంగా ఉన్నాం... వైద్య సేవలు పొందండి. తురకపాలెం వాసులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా ఇచ్చారు."మీకు అండగా ప్రభుత్వం ఉంది. వైద్యుల ద్వారా చికిత్స పొందండి. ఆందోళన చెందొద్దు" అని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తురకపాలెం గ్రామవాసులకు ధైర్యం చెప్పారు.

స్వల్పంగా అనారోగ్యం ఉన్నప్పటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు స్థానికులు సంశయిస్తున్న విషయాన్ని గుర్తించిన మంత్రి సత్యకుమార్ నేరుగా ఓ ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు నచ్చచెప్పారు. మిగతా 2లో...

# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే.. సత్వర న్యాయం

- మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలతో వివాదాలకు పరిష్కారం
- విశాఖలో ఏడీఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం
- ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖ,(జర్నలిస్ట్ ఫైల్):** ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా మిగతా 3లో...




## అంతుచిక్కని మరణాలపై ఆరా

- తురకపాలెంలో వరుస మరణాలపై మరింత లోతుగా పరిశోధన
- శని, ఆది వారాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపించండి
- సోమవారం కల్లా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం కావాలి
- వైద్యారోగ్య శాఖ అధికారులతో సీఎం సమీక్ష

2 లో



# ప్రభుత్వ విద్యకు ఏపీ మోడల్

## ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో దేశానికి ఆదర్శం అవుదాం




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ విద్య అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు రావాలని, అందరూ కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను సాకారం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 175మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సీఎం చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేశారు.

సభలో ప్రసంగించిన లోకేష్ మాట్లాడుతూ.. "నేను స్టాన్‌ఫోర్డ్ వరకు వెళ్ళగలిగినందుకు కారణం నా ఉపాధ్యాయులే. ఉపాధ్యాయులే ఒక విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దుతారు. అందుకే ఉపాధ్యాయుల సేవలు అత్యంత గొప్పవైపులలో ఒకటి" అని గుర్తు చేశారు. తన స్కూల్ డేస్, టీచర్ల మద్దతుతో సాధించిన విజయాల్ని స్మరించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందంటే కారణం టీచర్ల కృషే అని లోకేష్ అభిప్రాయపడ్డారు. కొంతమంది ఉపాధ్యాయులు స్కూటర్‌పై మైక్ కట్టుకొని ఊళ్లంతా తిరిగి అడ్మిషన్ల కోసం ప్రచారం చేశారని, తల్లిదండ్రులు పిల్లలను మిగతా 2లో...

# యూరియా కొరత రానివ్వొద్దు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై క్రిష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో మంత్రి మాట్లాడుతూ జిల్లాల్లో యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను అధిగమించాలని సూచించారు. అధికారిక లెక్కలు గ్రౌండ్ లెవెల్ నిల్వల్లో ఎలాంటి తేడా లేకుండా పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న యూరియా నిల్వల వివరాలను తక్షణం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. క్రిష్ణా, బాపట్ల, కడప జిల్లాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నందున కలెక్టర్లు త్వరితగతిన స్పందించి పరిష్కరించాలన్నారు. నిల్వలు ఎక్కువున్న ప్రాంతాల నుండి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు



యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. రబీ సీజన్ కోసం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావాల్సిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సమయానికి చేరుకునేలా రాష్ట్ర అధికారులు, పోర్ట్ అధికారులు, రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో వచ్చే తప్పుడు కథనాలపై వెంటనే స్పందించాలని, ప్రతిరోజూ వాస్తవాలు, యూరియా నిల్వల పరిస్థితిపై మీడియాకు కలెక్టర్లు వివరణ ఇవ్వాలని సూచించారు. యూరియా సరఫరాపై డయల్ యూవర్ కలెక్టర్ అనే కార్యక్రమానికి ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను మంత్రి అభినందించారు. పలు చోట్ల మన గ్రోమోరు దగ్గర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసి రైతులకు యూరియా అందేలా కలెక్టర్లు చొరవ చూపాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారిగా యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి పెడితే ఒక అంచనాకు వస్తామని, రైతులకు సులువుగా పంపిణీ చేసేందుకు మిగతా 2లో...

## పదేళ్లలో ఇదే మొదటిసారి..

- 156 మందికి ఎంపీడీవోలు గా పదోన్నతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక మంది ఉద్యోగుల పదోన్నతులపై ఏపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. డిప్యూటీ ఎంపీడీవోలు, పరిపాలన అధికారులుగా ఉన్న 156 మందికి ఎంపీడీవోగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. పంచాయతీరాజ్ శాఖలో ఒకేసారి భారీ సంఖ్యలో పదోన్నతులు కల్పించడం పదేళ్లలో ఇదే మొదటసారిగా తెలుస్తుంది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణ తేజ జారీ చేశారు. మిగతా 2లో...

# కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో అడుగు ముందుకేసింది. రాజధానిని విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారితో అనుసంధానించేందుకు కృష్ణా నదిపై ఒక ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మించడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ వంతెన నిర్మాణం ప్రజల ప్రయాణాన్ని సులభతరం చేయడం, ట్రాఫిక్‌ను తగ్గించడం కోసం మాత్రమే కాకుండా, అమరావతికి ఒక సాంస్కృతిక, శిల్పకళా గుర్తింపు తీసుకొచ్చేలా ఈ డిజైన్లను రూపొందించారు.

ప్రభుత్వం నాలుగు విభిన్న డిజైన్లు రూపొందించి, వాటిలో ఉత్తమమైనదాన్ని ప్రజలే ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో CRDA వెబ్‌సైట్‌లో ఓటింగ్‌కు పెట్టింది. ఈ నాలుగు డిజైన్‌లు కూడా కూచిపూడి నృత్య కళ, ఆధునిక ఇంజనీరింగ్ శైలి మేళవింపుతో ఉన్నాయి.

**డిజైన్‌ల వివరణ:**

1. రేడియేటింగ్ కేబుల్ బ్రిడ్జ్ - హస్త ముద్ర రూపంలో: ఈ డిజైన్ కూచిపూడి నృత్యంలోని హస్త ముద్రను పోలి ఉంటుంది. రేడియేటింగ్ స్టైల్లో కేబుల్స్ ఉండటం వల్ల ఇది ఒక శక్తివంతమైన నిర్మాణంగా కనిపిస్తుంది. ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని, నాట్య కళను సమగ్రంగా చూపుతుంది.
2. జంట పైలాన్ బ్రిడ్జ్ - స్వస్తిక హస్త భంగిమలో: ఎరుపు, తెలుపు రంగుల్లో రూపొందిన ఈ డిజైన్ రెండు పైలాన్‌లతో ఉంటుంది. ఇది కూచిపూడిలో కనిపించే స్వస్తిక ముద్రను పోలి ఉంటుంది. ఇది భారతీయ సంస్కృతికి, సాంప్రదాయానికి చిహ్నంగా ఉంటుంది.
3. 'A' ఆకార వంతెన - అమరావతిని సూచించేలా: ఈ డిజైన్ ఆంగ్ల అక్షరం 'A' మిగతా 3లో...

# సంపాదకీయం

## సుంకాల దెబ్బ టెక్స్‌టైల్ పరిశ్రమభవిష్యత్తు చీకట్లో...

రాష్ట్రంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ నేటి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. విద్యుత్తు భారంతో కుదేలవుతున్న మిల్లులకు అమెరికా విధించిన 50 శాతం సుంకాలు మరణఘంటికలుగా మారాయి. పదేళ్లుగా నష్టాల బాటలో నడుస్తున్న ఈ రంగం ఇప్పుడు మరీ పూర్తిగా కుప్పకూలే ప్రమాదంలో ఉంది. సుమారు సగం మిల్లులు మూతపడగా, మిగిలినవి కూడా కష్టాల బారిన పడ్డాయి. వీటిలో పనిచేస్తున్న లక్షలాది కార్మికులు నిరుద్యోగం అంచున నిలబడి ఉన్నారు. రాబోయే సీజన్లో పత్తి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారనుంది. ఎగుమతులు నిలిచిపోవడంతో రైతు పండించిన పత్తికి కనీస మద్దతు ధర కూడా దొరకదేమో అన్న సందేహం గట్టిగా వినిపిస్తోంది. ఈ సమస్య ఒక రంగానికే పరిమితం కాదు. దూది నుంచి వస్త్రాల వరకు విస్తరించిన ఈ ఉత్పత్తి శ్రేణి వ్యవసాయం, పరిశ్రమ, కార్మిక లోకాన్ని కలుపుతోంది. ఇందులోని ఎక్కడైనా విరామం వస్తే దాని ప్రభావం అన్ని స్థాయిలకూ వ్యాపిస్తుంది. పత్తి రైతు నుంచి మిల్లులో పనిచేసే కార్మికుడి వరకు ప్రతీ ఒక్కరి జీవనాధారం కదిలిపోతుంది. ఇప్పటికే మూడు లక్షల మంది కార్మికులు ప్రత్యక్షంగా, మరో రెండు లక్షల మంది పరోక్షంగా ఉపాధి కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. ఈ సంక్షోభానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి – విద్యుత్తు భారాలు. రెండవది – అమెరికా సుంకాల పెంపు. ఒక మిల్లును నడపడానికి ఏడాదికి రెండు కోట్ల రూపాయలు ఖర్చవుతుంటే, అందులో సగానికి పైగా విద్యుత్తు బిల్లులే అవుతుండటం చిన్న విషయం కాదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీ బకాయిలు కూడా వేల కోట్ల రూపాయలుగా పేరుకుపోయాయి. దీనికి తోడు ఎగుమతులపై అమెరికా సుంకాల పెంపు వస్త్ర మార్కెట్‌ను పూర్తిగా స్తంభింపజేసింది. ఇక ప్రశ్న ఏమిటంటే – ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ఏ పరిశ్రమను చూసిన భవిష్యత్తు భద్రత అవసరం. ఉద్యోగాలను కాపాడడం, రైతుల పంటకు మార్కెట్ కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం. ఈ క్రమంలో విద్యుత్తు ఛార్జీలను తగ్గించడం, బకాయిలను చెల్లించడం, సబ్సిడీలను సమయానికి విడుదల చేయడం తప్పనిసరి. అలాగే, అమెరికా సుంకాల సమస్యను దౌత్యపరంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలి. లేదంటే ఈ రంగం కూలిపోతే దాని ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద పడక తప్పదు. ప్రభుత్వాలు ఈ సంక్షోభాన్ని చిన్న సమస్యగా తీసుకోవడం ప్రమాదకరం. పత్తి రైతులు, మిల్లుదారులు, కార్మికులు – వీరందరి భవిష్యత్తు నిలబడటానికి తక్షణ చర్యలు అవసరం. లేకపోతే "తెలుగునాట వస్త్ర పరిశ్రమ చరిత్ర" గతకాలపు గాథగానే మిగిలిపోతుంది. ఇప్పటికైనా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి, మిల్లులను, రైతులను, కార్మికులను ఆదుకోవాలి.

-అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్

# గురువులను మరువలేం..




(మొదటి పేజీ తరువాయి)

రాధాకృష్ణన్ రేణిగుంట పాఠశాలలో టీచర్‌గా, ఏయూలో ఆచార్యుడిగా పని చేశారని అన్నారు.

గత ఏడాది బుడమేరు వరదల కారణంగా గురుపూజోత్సవం జరుపుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. 175 మంది ఉపాధ్యాయులు ఇచ్చిన సూచన, సలహాలతో వారి ఫొటోలతో పుస్తకాన్ని ముద్రిస్తామని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు కాని మా ఇంట్లో లోకేశ్ చదువు గురించి నా భార్య భువనేశ్వరి చూసేవారని ఈ విషయంలో ఆ క్రెడిట్ ఆవిడదేనని సీఎం అన్నారు.

విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం: గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను ప్రపంచానికి చాటుదామని మంత్రి స్పష్టం చేశారు. చదువు ఒక వ్యక్తిని పేదరికం నుండి బయటకి తీసుకొస్తుందనటానికి ప్రత్యక్ష ఉదాహరణ ఏపీజే అబ్దుల్ కలాం అని తెలిపారు. గురువులే చూపించిన దారే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని గుర్తు చేసుకున్నారు. మంత్రి నారాయణ తనకు బ్రిడ్జ్ కోర్స్ నేర్పించిన తీరు తన జీవితాన్ని మార్చేసిందని తెలిపారు. చదువు కోసం ఇంటి నుండి బయట ఉన్నప్పుడు సమాజం గురించి తెలిసిందన్నారు.

సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో తొలిసారి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డ్ పెట్టామని, ఇది ఉపాధ్యాయులతోనే సాధ్యమైందని స్పష్టం చేశారు. విద్యా శాఖను ఛాలెంజ్‌గా తీసుకొని అందరి సహకారంతో అనేక సంస్కరణలు తీసుకొని వచ్చానన్నారు. ప్రభుత్వ విద్యలో రాజకీయాలను దూరం పెట్టాలని సూచించారు. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలానే మెగా పేరెంట్–టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశామని ఇంకా పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచామని పుస్తకాల సంచులపై ప్రముఖుల ఫొటోలు ముద్రించామని వివరించారు. అలానే కొన్ని పథకాలకి సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టామని తెలిపారు.







## ప్రభుత్వ విద్యకు ఏపీ మోడల్



(మొదటి పేజీ తరువాయి)

గవర్నమెంట్ స్కూల్స్‌లో చేర్చుకోవడం వల్ల "జీరో ఇన్వెస్ట్మెంట్ – హై రిటర్న్స్" సాధ్యమవుతుందని ఒక మహిళా ఉపాధ్యాయురాలు చెప్పిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు.

"ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు పెట్టిన పరిస్థితి వచ్చిందంటే అది ఉపాధ్యాయుల కృషివల్లే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు – అందరినీ అనుసంధానిస్తూ సంస్కరణలు చేపట్టాం. రాబోయే నాలుగేళ్లు కొత్త సంస్కరణలు ఉండవు. ఉన్నవాటినే పకడ్బందీగా అమలు చేస్తాం" అని లోకేష్ స్పష్టం చేశారు.

డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ అని లోకేష్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు జరిగిన 13 డీఎస్సీల ద్వారా లక్షా 80వేల మంది ఉపాధ్యాయులను నియమించారని, రాబోయే నెలలో మరో 16,347మంది ఉపాధ్యాయులు టీచింగ్‌లో చేరనున్నారని వివరించారు. పారదర్శకంగా టీచర్ ట్రాన్స్ఫర్ యాక్ట్‌ను అమలు చేస్తున్నామని, ప్రమోషన్ల విషయంలోనూ సీనియారిటీ ఆధారంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు వైన్‌షాపుల ముందు కాపలా కాసే పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. "అయినా ఉపాధ్యాయులు అద్భుతంగా పనిచేసి.. దేశం మొత్తం మనవైపు చూడేలా ఫలితాలు రాబట్టారు. ప్రభుత్వ విద్యలో ఇప్పుడు చరిత్ర సృష్టించే దిశగా ముందుకు వెళున్నాం" అని లోకేష్ పిలుపునిచ్చారు.

"విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠ్యాంశాలు రూపొందిస్తున్నాం. ప్రైమరీ, ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయిలో నాణ్యతపై దృష్టి పెడుతున్నాం. ప్రభుత్వ విద్య గురించి ఎవరైనా మాట్లాడితే ఇకపై ఏపీ గురించి మాట్లాడే స్థాయికి తీసుకెళుదాం" అని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ చీఫ్ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బోండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యూరియా కొరత రానివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులు తొలుగుతాయన్నారు. మండలాల వారిగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, రాబోవు 10 రోజుల వరకు కలెక్టర్లు యూరియా పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. అవరమైతే టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో యూరియా పంపిణీ కి సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ తయారుచేసి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ పర్యవేక్షిస్తుందని ఈ.ఓ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మంత్రికి తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఈ.ఓ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ , వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, క్రిష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, శ్రీకాకుళం జిల్లా స్వప్నిల్ దినకర్ పుడ్కర్, బాపట్ల జిల్లా కలెక్టర్ మురళి, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు.

## పదేళ్లలో ఇదే మొదటిసారి..

(మొదటి పేజీ తరువాయి)

తాజా ఉత్తర్వుల ప్రకారం.. 94 మంది డిప్యూటీ ఎంపీడీవోలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయాల్లోని పరిపాలన అధికారులు మరో 62 మంది ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందారు. పలువురు ఎంపీడీవోలకు డివిజినల్ డెవలప్మెంట్ అధికారులు (డీఎల్‌డీవో)గా ఇటీవల పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఆ ఖాళీలను డిప్యూటీ ఎంపీడీవో, పరిపాలన అధికారులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు.

## ప్రవక్త బోధనలు ఆచరణీయం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మిలాన్ నబీ పండుగ సందర్భంగా శుక్రవారం గుంటూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వందల సంఖ్యలో ముస్లిం సోదరులతోపాటు ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ఇస్లామిక్ ప్రవచనాలు పలికారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ శాంతి, కరుణ, ప్రేమతత్వాన్ని మిలాన్ నబీ బోధించారని తెలిపారు. నబీ బోధనలు ఆచరించడం ద్వారా మహోన్నత జీవితాన్ని పొందవచ్చని చెప్పారు. సమాజంలో తోటి వ్యక్తుల పట్ల కరుణ కలిగి ఉండాలన్నారు. మన సంపాదనలో పేద వారికి తోచినంత సాయమందించాలని, ఇది దేవునికి ప్రియమైన కార్యమని వివరించారు. ఏ సమయంలోనైనా సత్యవాక్యమే మనల్ని కాపాడుతుందని, దీనికి పిల్లలకు చిన్నవయసు నుంచే బోధించాలని సూచించారు. శత్రువులను సైతం క్షమించే గుణాన్ని కలిగి ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమని, ఈ విషయాన్ని అందరూ ఆచరించాలని చెప్పారు.

# ఆందోళన చెందొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం మధ్యాహ్నం సుమారు గంటా 45 నిముషాల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యశిబిరానికి వెళ్లి అక్కడ ఇప్పటివరకు జరిగిన పరీక్షల నిర్వహణ వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, గుంటూరు జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ఇప్పటి వరకు స్థానికులకు అందించిన వైద్య సేవల్ని మంత్రికి వివరించారు. శిబిరం వద్ద పరీక్షల కోసం వేచిఉన్న స్థానికులతోను మాట్లాడారు.

ఈ సందర్భంగా స్థానికులు ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందేందుకు వెనకాడుతున్నారని, సాధారణ వైద్యంతో సరిపెడుతున్నారని మంత్రి గమనించారు. తానే స్వయంగా వైద్య శిబిరానికి అ–రకిలో మీటరు దూరంలో ఉన్న దంపతులు జి.శ్రీనివాసరావు, విజయకుమారి ఇంటికి మంత్రి సత్యకుమార్ నడుచుకుంటూ వెళ్లారు.

ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉండి కోలుకుంటున్నానని చెప్పిన విజయకుమారితో గుంటూరు జీజీహెచ్ కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. రక్త పరీక్షలతో పాటు అవసరమైతే స్కానింగ్ వంటి పరీక్షల్ని ఉచితంగా చేస్తారని, సంశయించవద్దని మంత్రి కోరారు.

తురకపాలెం గ్రామ వాసులకోసం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే సమయంలో అక్కడున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కూడా ఆసుపత్రిలో చికిత్స పొందాలని నచ్చచెప్పారు. ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు కూడా అక్కడే ఉన్నారు.



**మరణించిన వారి కేస్ షీట్లను పరిశీలించాలని కృష్ణబాబు ఆదేశాలు**

గుంటూరు జీజీహెచ్ లో మరణించిన వారి కేస్ షీట్లను వైద్య నిపుణులతో పరిశీలన చేయించాలని డిఎంఇ డాక్టర్ రఘునందన్‌ను వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన మాట్లాడారు.

## బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నిరుద్యోగ బీసీ యువతకు ఉచిత శిక్షణ అందించినందుకు బీసీ సంక్షేమ శాఖకు 2025 సంవత్సరానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. ఈ అవార్డును సెప్టెంబర్ 20న న్యూఢిల్లీలో అందజేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్ నిర్వహించి వేలాది మందికి లబ్ధి చేకూర్చారు. 1,674 మందికి ఆఫ్‌లైన్ శిక్షణ, 4,774 మందికి ఆన్‌లైన్ శిక్షణ కలిపి మొత్తం 6,470 మందికి ఉచిత కోచింగ్ అందించారు. సివిల్ సర్వీసెస్‌లో 83 మంది బీసీ అభ్యర్థులు ఈ శిక్షణ ద్వారా లబ్ధి పొందారు. స్కోచ్ అవార్డు రావడం సీఎం చంద్రబాబుకు ఉన్న బీసీలపై చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి సవిత అన్నారు. జగన్ పాలనలో బీసీలు నిరాదరణకు గురయ్యారని, ఇక కూటమి ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# అంతుచిక్కని మరణాలపై ఆరా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత రెండు నెలలుగా గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుచిక్కని వ్యాధితో సంభవిస్తున్న వరుస మరణాలపైనా, ఆ గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యారోగ్య శాఖాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో దీనిపై చర్చించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. జూలై, ఆగస్ట్ నెలల్లో ఈ గ్రామం నుంచి 20 మంది చనిపోవడానికి గల కారణాలపై మొదట దృష్టి పెట్టాలని... ముందుగా అనుమానిత లక్షణాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అన్నికోణాల్లోనూ పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం శని, ఆది వారాలు ప్రత్యేక వైద్య బృందాలు తురకపాలెం పంపించాలని... గ్రామంలోని అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహించి సోమవారం కల్లా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలన్నారు. అక్కడ ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి... దీనిని హెల్త్ ఎమర్జెన్సీగా పరిగణించాలన్నారు. అనారోగ్య తీవ్రత ఎక్కువుగా ఉన్నవారిని ఆస్పత్రుల్లో చేర్పించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు.



**కేంద్ర వైద్య బృందాల సాయం తీసుకోండి:**

సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఎయిమ్స్ సహా కేంద్ర వైద్య బృందాలు రప్పించండి...అవసరమైతే అంతర్జాతీయ వైద్యుల సాయం తీసుకోండి... పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి, భూమి ద్వారా బ్యాక్టీరియా వ్యాపించే అవకాశం ఉంది. అప్రమత్తంగా వ్యవహరించండి. తురకపాలెంలో అందరికీ సురక్షిత తాగునీరు అందించండి. పరిశుభ్రమైన వాతావరణం, ఆహారంపై అవగాహన కల్పించండి. ప్రతీ రోగిని వైద్య పర్యవేక్షణలో ఉంచాలి. హెల్త్ ప్రొఫైల్ నిరంతరం పర్యవేక్షించాలి. కొత్త కేసులు ఏమాత్రం నమోదుకాకూడదు. పరిస్థితులు నియంత్రణలోకి రావాలి... స్థానికుల్లో నమ్మకాన్ని పెంచాలి. జ్వరంతో బాధపడుతున్నవారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండండి.' అని సీఎం సూచించారు.

**72 గంటల్లో రిపోర్టులు:**

మరోవైపు తురకపాలెంలో ప్రస్తుతం ఉన్న కేసులను పరిశీలిస్తే 'మెలియోయిడోసిస్' లక్షణాలు ఉన్నట్టు వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేశారు. బ్లడ్ శాంపిల్స్ ల్యాబులకు పంపడం జరిగిందని... 72గంటల్లో రిపోర్టులు వస్తాయని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. పశు పోషణ పైనా ఎక్కువ మంది ఆధారపడటంతో పశువుల నుంచి ఏమైనా బ్యాక్టీరియా వ్యాప్తి చెందవచ్చనే కోణంలోనూ పరిశీలన జరుపుతున్నామన్నారు. తురకపాలెంలో డయాబెటిస్, హైపర్ టెన్షన్, కార్డియాక్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులు ఎక్కువుగా ఉన్నాయని... అలాగే అక్కడ ఆల్కహాల్ వినియోగం అధికంగా ఉందని, స్టోన్ క్రషర్లు ఆ ప్రాంతంలో ఎక్కువుగా ఉండటంతో వాతావరణ నాణ్యతను కూడా చెక్ చేస్తున్నామని వివరించారు. మొదట జ్వరం, దగ్గు, తర్వాత ఊపిరితిత్తులు దెబ్బతినడం వంటి లక్షణాలు ఎక్కువ మందిలో సాధారణంగా కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. యాంటిబయాటిక్స్ ఆరు వారాలు నిరంతరాయంగా వాడటం వల్ల వ్యాధి నియంత్రణలోకి వస్తోందని చెప్పారు. దీనిపైన మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ కూడా పరిశోధన చేస్తోందని తెలిపారు.

**మెలియోయిడోసిస్:**

మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమిలోనూ, నిల్వ నీరులో, తడి నేలలో ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, వరదల సమయంలో వ్యాప్తి చెందుతుంది. డయాబెటిస్, కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు... వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు... రైతులు, నీటిలో ఎక్కువగా పనిచేసేవారు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. మట్టిలో, నీటిలో ఉన్న బ్యాక్టీరియా గాయాలు లేదా చర్మ పగుళ్లు ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందన్నారు. కాలుష్యమైన నీరు తాగినా, ఒక్కోసారి శ్వాస ద్వారా కూడా సంక్రమించవచ్చని చెప్పారు.

# కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన

(మొదటి పేజీ తరువాయి)



రూపంలో ఉంటుంది. అమరావతి పేరుని సూచించేలా ఉండటం, అభయ ముద్రలా ఉండటం వల్ల ఇది శాంతి, రక్షణకు సంకేతంగా కనిపిస్తుంది. ఇది అత్యంత ఆధునికతను ప్రతిబింబిస్తుంది.

4. కపోత ముద్ర బ్రిడ్జ్ – అభివాద ముద్రలో: ఈ డిజైన్ కూచిపూడిలోని కపోత ముద్ర ఆధారంగా డిజైన్ చేశారు. చేతులు ఎత్తి నమస్కరించేలా ఉంటూ, ఓ స్వాగత ద్వారంలా కనిపిస్తుంది. ఇది సందర్శకులకు ఓ సంస్కృతిక అర్థం కలిగిన అపూర్వ అనుభూతిని కలిగిస్తుంది.

**ఓటింగ్ ప్రక్రియ:**

ప్రతి పౌరుడికీ డిజైన్ ఎంపికలో భాగస్వామ్యం అయ్యే అవకాశం ఉంది.

ఇందుకోసం: CRDA అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లాలి.

పేరు, ఫోన్ నంబర్ నమోదు చేయాలి.

నలుగు డిజైన్లలో మీరు ఇష్టపడిన ఒక డిజైన్‌ను ఎంచుకోవాలి.

క్యాప్చా కోడ్ నమోదు చేసి, సబ్మిట్ చేయాలి.

ఈ ఓటింగ్ ప్రక్రియ పూర్తిగా ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించేలా డిజైన్ చేశారు.

**వంతెన స్థానం, ప్రాముఖ్యత:** ఈ ఐకానిక్ కేబుల్ వంతెన అమరావతిలోని రాయపూడి నుంచి ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వరకు నిర్మించనున్నారు. దాదాపు 5 కి.మీ. పొడవుతో, ఇది రాజధానిని విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారికి అనుసంధానిస్తుంది. వంతెన పూర్తయిన తర్వాత, ఇది పర్యాటక ఆకర్షణగా మారే అవకాశమూ ఉంది. పక్కనే ఉన్న ప్రాంతాల అభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

ఈ ఐకానిక్ బ్రిడ్జ్ కేవలం ఒక రహదారి కట్టడమే కాదు. ఇది మన సంస్కృతిని, కళను, అభివృద్ధిని ప్రపంచానికి చాటే ఒక ఐకానిక్ వంతెగా నిలవనుంది. ప్రజలే ఓటు వేసి ఎంచుకునే ఈ డిజైన్, అమరావతి నగరానికి శాశ్వత గుర్తింపునిస్తుందనే దానిలో ఎటువంటి సందేహం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈ డిజైన్లలో మీకు ఏది ఇష్టమో మీరు ఓటు వేయడం ద్వారా అమరావతి నగర భవిష్యత్తులో మీ వంతు పాత్రను పోషించవచ్చు. మీరు ఇంకా ఓటు వేయలేదు అంటే, ఇప్పుడే వెబ్‌సైట్‌కి వెళ్లి ఓటు వేయండి. మీ అభిప్రాయం అమరావతి రూపాన్ని తీర్చిదిద్దుతుంది!. ఇది మన సంస్కృతి, కళ, అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుంది.

# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే.. సత్వర న్యాయం

(మొదటి పేజీ తరువాయి)





న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్థవంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం భారత్ కు కొత్తకాదని తరాలుగా మనకు అందుబాటులో ఉందని తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్థవంతమైన మీడియేటర్ గా వ్యవహరించారని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్థంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. ముఖ్యమంత్రి ఇంకా మాట్లాడుతూ.. " విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకం. ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభం. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షికతకు, పారదర్శకతకు పెట్టింది పేరు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతీ పౌరుడికీ ఉంది. భారత్ అత్యంత వేగంగా సంస్కరణల్ని అమలు చేస్తోంది. గత ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయి. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలి. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి." అని అన్నారు.

**విశాఖలో ఏడీఆర్ ఎకో సిస్టం ఏర్పాటుకు సిద్ధం**

విశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతో పాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్ కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికీ చాలా మంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని దీన్ని మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని అన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఈ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



○ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీజీఓ సంఘం నిరంతరం అంకితభావంతో, చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గం, అన్ని తాలూకా కార్యవర్గ సభ్యులతో శుక్రవారం జరిగిన సమావేశం గుంటూరు ఎన్జీవో రిక్రియేషన్ హాలులో జరిగింది. జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వేల కోట్ల రూపాయల బకాయిలు ఉద్యోగులకు విడుదల చేశారని, రానున్న రోజుల్లో డిఏలు, పిఆర్సీలు, ఇతర సౌకర్యాలు తప్పనిసరిగా మంజూరు చేస్తామని అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 205 తాలూకాలతో అతిపెద్ద జేఏసీగా తమ సంఘం నిలుస్తోందని, తాలూకా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యోగుల ఐక్యతతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా ఉంటేనే తమ హక్కులు సాధించగలమని చెప్పారు. ప్రతి ఒక్క సభ్యుడు సంఘానికి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం సూచనల మేరకు రాష్ట్ర సంఘం సూచనలు సలహాలు మేరకు తమ జిల్లా సంఘం అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఉద్యోగుల ప్రయోజనాలు సాధించడంలో తాము శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు. ఏఎన్ఎంలు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అలాగే వారి పదోన్నతి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర నాయకులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఆడహాక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఎం. రామకృష్ణను చైర్మన్‌గా, కే. నాగేశ్వరరావును కన్వీనర్‌గా, బ్రహ్మేశ్వరరావును ట్రెజరర్‌గా, సభ్యులుగా రామయ్య, అప్పారావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులను నియమించారు. నవంబర్ నాటికి పల్నాడు జిల్లా ఎన్జీవో సంఘం నూతన కార్యవర్గం ఏర్పడుతుందని తెలిపారు.

రాష్ట్ర నాయకులు జగదీష్, రంజిత్ నాయుడు, రామ్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, మహిళ విభాగ కన్వీనర్ రాజ్యలక్ష్మి, జిల్లా నాయకులు సుకుమార్, కూరాకుల శ్రీనివాసరావు, శ్రీవాణి, కృష్ణ కిషోర్, సయ్యద్ జానీబాషా, విజయ్ విజయలక్ష్మి, నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎన్జీవో నాయకులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అ-రండల్‌పేట 16వ లైనులోని ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. 50 ఏళ్ల క్రితం ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆ దశలో వారికి పాఠాలు చెప్పిన ఇందిర టీచర్, సుశీల టీచర్‌లతో పాటు ప్రస్తుత ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పూర్వ విద్యార్థి వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ ం "ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు. వారు కేవలం జ్ఞానాన్ని పంచడం మాత్రమే కాదు, మన జీవితాలను సన్మార్గంలో నడిపించే మహనీయులు. చిన్నప్పుడు 'అయ్యవారికి నూరు వరహాలు, పిల్లవానికి చాలు పప్పు బెల్లాలు' అనే సామెత ద్వారా గురువు-శిష్యుల బంధం ఎంత పవిత్రమో అర్థమవుతుంది. ఉపాధ్యాయ దినోత్సవం అనేది అలాంటి గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే సందర్భం" అని అన్నారు.

అలాగే దేశానికి మొట్టమొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతినే ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామనీ, ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నీలం సతీష్ బాబు, బోరుగడ్డ పాల్ ప్రదీప్ కుమార్, పెనుమూడి వేణుగోపాల్, గుమ్మడి ఆనంద్ కుమార్, గోరంట్ల మధు, చిన్నం పద్మాకర్, తుమ్మేటి కృష్ణ, ఆంజనేయులు, తల్లం రమేష్, మునగ గణపతి, సుబ్రహ్మణ్యం, బట్రాజ్ కృష్ణ కిషోర్, ఎల్లంపల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా హెడ్ మిస్ట్రెస్ విజయరాణి, సీనియర్ టీచర్ రాజేశ్వరి దేవి, ఉపాధ్యాయులు షర్మిల, ఇతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

# గంట కొడితే ప్రసంగం ఆపే వ్యక్తి ఉపాధ్యాయుడు.. ఆపనివారు రాజకీయ నాయకులు : మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం రూరల్ ( జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం నాడు స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రం లో జిల్లా పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మొత్తం 87 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, స్పెషల్ గ్రేడ్ టీచర్స్, ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా గురుపూజోత్సవం జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఒక చలోక్తి ద్వారా సభలో నవ్వులు పూయిస్తూ, "గంట కొడితే ప్రసంగం ఆపే వ్యక్తి ఉపాధ్యాయుడు అయితే, గంట కొట్టినా ప్రసంగం ఆపని వారు రాజకీయ నాయకులు" అని పేర్కొన్నారు. సమాజం ఉన్నతంగా ఎదిగేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. గురువులను కించపరిచే భాష వాడరాదని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి దిశగా సాగుతోందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, ఒక వ్యక్తి సాధనతో ఎలాంటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో సర్వేపల్లి రాధాకృష్ణ ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నోబెల్ వృత్తి అని పేర్కొన్నారు. "మన జీవితాన్ని ప్రభావితం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడే, అందులో ఎటువంటి సందేహం లేదు" అని అన్నారు. ఈ సందర్భంగా మరో గొప్ప వ్యక్తిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, "అబ్దుల్ కలాం కూడా ఒక ఆదర్శ ఉపాధ్యాయుడే. ఆయన తన జీవితమంతా విద్యార్థుల కోసం అంకితం చేశారు" అని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుందని, వారు బోధించే అంశాలు తెలిసో తెలియకో జీవితంపై చెరగని ముద్ర వేస్తాయని అన్నారు. "నేను కూడా ఒక టీచర్ బిడ్డనే గర్వంగా చెబుతున్నాను" అంటూ ప్రసంగం ముగించారు.

సభాధ్యక్షులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. తల్లిదండ్రులు తర్వాత పిల్లల జీవితాలను మలిచే గొప్పవారు ఉపాధ్యాయులని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా లాలా చెరువు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జుహితా కామన్వెల్త్ గేమ్స్‌లో 69 కేజీ విభాగంలో 96 కేజీలు బరువెత్తి గోల్డ్ మెడల్ సాధించడాన్ని ప్రస్తావించారు. ఆమెను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఒలింపిక్ పతకాన్ని సాధించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, "మేమందరం మీ విద్యార్థులమే" అంటూ ఉపాధ్యాయులకు నమస్కారాలు తెలిపారు. ఉపాధ్యాయులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్వదేశీ వస్తువులు వాడాలని పిలుపునిచ్చారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక గురువుల నుంచి ఆధునిక బోధకుల వరకు అందరూ పూజనీయులని అన్నారు. విద్యావిధానంలో సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భారతీయ సంస్కృతి, వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, ఉత్తర్వులను అమలు చేయడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు విజ్ఞానంతో పాటు విలువలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ శాసనసభ్యులు, ఆదిరెడ్డి శ్రీనివాస్, శాసనమండలి స భ్యులు, సోము వీర్రాజు, అనపర్తి శాసనసభ్యులు, నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ మేగా స్వరూప్, ఆర్టీవో ఆర్. కృష్ణనాయక్ కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, అడిషినల్ ఎస్పీ సుబ్బ రాజు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్ సుభాషిణి, జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవ రావు, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్, అర్బన్ రేంజ్ డిఐ బి. దిలీప్ కుమార్, రూరల్ ఎమ్ ఈ వో. తులసి దాస్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో టీచర్స్ డే



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అశోక్‌నగర్ రెండో లైన్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పసల బాలస్వామి అధ్యక్షతన గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఆర్ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు మాట్లాడుతూ, రాధాకృష్ణన్ గారి జీవితం, బోధనల గురించి చక్కగా వివరిస్తూ గురువుల ప్రాధాన్యతను గుర్తు చేశారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి చ. పద్మావతి ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను వివరించారు. ఇరువై సంవత్సరాలుగా కార్పొరేషన్‌లో ప్రమోషన్లు లేవని, మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. తరువాత ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందించిన వారిని ముఖ్య అతిథి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారు: ఎస్.కె. ఖాజావలి, ఓ. నాగార్జున, ఏ. వెంకటేశ్వరరావు, టి. శ్రీలక్ష్మి, పాలేటి శ్రీనివాసరావు, కె.ఎస్.ఎస్. ప్రసాద్, టి. స్టాలిన్, పి. మార్తమ్మ, కె. పీటర్ పాల్, కె. ఫణిదత్తు, వి. సీతారాములు, నాగమంజరి, కె. పూర్ణచంద్రరావు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి ఎన్.వి. జగదీష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేటి జగదీష్ బాబు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు జి.వి. శ్రీధర్, బాలాజీ నాయక్, అనిల్‌కుమార్‌తో పాటు అనేక మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. 300 వద్ద డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా రైల్వే అధికారులు మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్థానిక నివాస్థితులతో మాట్లాడారు. నగరంలోని మూడు వంతెనల వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి రైల్వే అధికారులు మార్కింగ్ చేశారని తెలిపారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా రైల్వే స్థలంలో నిరుపేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, రైల్వే అధికారులు 21 మీటర్ల వరకు డ్రైనేజీ నిర్మాణానికి అవసరమని మార్కింగ్ చేశారని వివరించారు. అయితే పేదలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సాధ్యమైనంత వరకు నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైనేజీ నిర్మాణంలో తక్కువ స్థలం తీసుకునేలా రైల్వే అధికారులతో కూటమి నేతలు సంప్రదింపులు చేస్తున్నామని అన్నారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నామన్నారు. అభివృద్ధితోపాటు ప్రజా సమస్యలను తాము పూర్తిగా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అధికారులు డ్రైనేజీ నిర్మాణంలో సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణానికిఆమోదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 2309 విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. వీటి నిర్మాణానికి అవసరం అయిన రూ.217.10 కోట్లు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 2309 భవనాలను %వీ+చీ=జు+తా% పథకం కింద నిర్మాణానికి ఆమోదం తెలపగా.. అదనంగా మరో 696 భవనాలు (ప్రతి యూనిట్ ఖర్చు రూ.55.00 లక్షలు) %ూవీ-ూదీఎ×వీ% స్కీం కింద నిర్మాణానికి అనుమతించారు. తాజా నిర్ణయంతో ప్రతి యూనిట్‌లో 42.00 లక్షలు భవనం నిర్మాణానికి, 13.00 లక్షలు కాంపౌండ్ వాల్, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలకు ఉపయోగిస్తారు. ఈ 2309 విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కాపాడవచ్చు. అలాగే గ్రామీణ, ట్రైబల్, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిత్యం నిర్వహించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## వరుణ్ హై స్కూల్ నందు ఘనంగా టీచర్స్ డే




**బ్రహ్మంగారిమఠం ( జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని వరుణ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు విద్యార్థినీ విద్యార్థులు పూలు పళ్ళను అందజేసి పాద నమస్కారం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం గా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు. ఉపాధ్యాయుడిగా మొదలెట్టి దేశ రాష్ట్రపతిగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి పలువురు కొనియాడారు. ఆయన చదువుకున్న రోజుల్లో ఉపాధ్యాయుల పట్ల ఎంతో భక్తి భావం తో ఉండేవారని మంచి క్రమశిక్షణతో పట్టుదల కలిగిన విద్యార్థిగా చదువు పట్ల మక్కువతో చదివి ఉపాధ్యాయునిగా మకుటం లేని మహారాజుగా వెలుగొండరని ఆ తర్వాత రోజుల్లో ఆయన మన భారతదేశం తొలి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారని ఆయన ఎందరికో ఆదర్శంగా నిలిచార అనేదానికి నిదర్శనమే నేడు యావత్ భారతదేశం అంతా ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామంటే ఆయన ఎంత గొప్పవారో ఎంత క్రమశిక్షణతో మెలిగారో ఎన్ని మంచి పనులు చేపట్టారు దీనిని బట్టే అర్థమవుతుందని వారు కొనియాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లుగా విద్యార్థినీ విద్యార్థులు అందరూ పట్టుదలతో ఇష్టంతో కష్టపడి చదవాలని ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు చెప్పినటువంటి అంశాలతో పాటు కొత్త విషయాలను కూడా తెలుసుకుంటూ మీరు కూడా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ లాగా ఉన్నత స్థానానికి ఎదగాలని అప్పుడే మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కు అలాగే మీకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులైన మాకు మంచి పేరు ప్రతిష్టలు రావడంతో పాటు మీకు మంచి గుర్తింపు వస్తుందని విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రణయ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు రామయ్య ఓబుళపతి బొమ్ము రవి కాంత్ రెడ్డి రామచంద్రారెడ్డి నాగార్జున సందీప్ పివి కళ్యాణి సుభాషిని సౌజన్య భారతి తదితరులతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## యూనివర్సల్ హెల్త్ పాలసీకి స్వాగతం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న యూనివర్సల్ హెల్త్ పాలసీని ఆంధ్రప్రదేశ్ దళిత, గిరిజన వైద్యమిత్ర యూనియన్ స్వాగతించింది. నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రజల కోసం కొత్త ఆరోగ్య భీమా విధానాన్ని ఆమోదించగా, ఈ నిర్ణయం పేదలకు ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి తెలిపారు. హైబ్రిడ్ మోడల్‌లో అమలు కానున్న ఈ ఆరోగ్య భీమా పథకం ప్రకారం రూ. 2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ కంపెనీ పరిధిలో ఉండగా, రూ. 2.50 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యం అందనుంది. మొత్తం 3,257 వ్యాధులు చికిత్స పరిధిలోకి వస్తాయి. క్లెయిమ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాచర్ల బుజ్జి మాట్లాడుతూ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న 2,100 మంది వైద్యమిత్రులు నెలకొన్న అభద్రతాభావాన్ని ప్రభుత్వం తొలగించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, జీతం పెంపు, క్యాడర్ కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్యోగ సంఘ నాయకులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని, మేనిఫెస్టోలో చెప్పిన సంక్షేమ పథకాలు వైద్యమిత్రులకు కూడా వర్తింప చేయాలని మాచర్ల బుజ్జి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పరిధిలో ఉన్న వైద్యమిత్ర సేవలను కొనసాగించి, ఏజెన్సీలకు అప్పగించకుండా కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# వరద నష్ట నివేదికలు జాగ్రత్తగా సిద్ధం చేయండి

## నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** కేంద్రప్రభుత్వం విధానాలకు అనుగుణంగా వరద నష్ట నివేదిక తయారించాలని ఏ మాత్రం పొరపాటు జరిగినా విపత్తు సహాయం బాధితులకు అందకుండా పోతుందని అధికారులను నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో క్షేత్రస్థాయి లో, జిల్లా సమీక్షా సమావేశంలో సీతక్క మాట్లాడుతూ ప్రజల కష్టాలలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి శుక్రవారం కామారెడ్డిలో పర్యటిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ తక్కువ సమయంలో భారీ వర్షం కురవడం వల్ల ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చాయని, ప్రభుత్వం అలర్ట్ చేసిన వెంటనే అధికారులు, నాయకులు కలిసికట్టుగా పని. చేయడం వల్ల 300 పైగా ప్రజల ప్రాణాలు కాపాడ గలిగామని అన్నారు. హైవే దెబ్బ తినడం వల్ల ఇబ్బందులు పడిన ఇతర రాష్ట్రాల ప్రజలకు కూడా ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించడం జరిగిందని అన్నారు .పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, వరదల సమయంలో ముఖ్య మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలను ఆదుకున్నామని అన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా గతంలో రాలేకపోయామని, పోచారం, నిజంసాగర్ ప్రాజెక్టు వరద ఉధృతి ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు చేపట్టామని అన్నారు.జహీరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ, వరదల వల్ల కామారెడ్డి జిల్లాలో తీవ్ర నష్టం జరిగిందని, ముఖ్యమంత్రి వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తం చేసి ప్రజల కష్టాల తొలగించేందుకు చర్యలు చేపట్టారని, దీని కోసం కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, వరదల సమయంలో అధికారులు బాగా పనిచేసే ప్రజల ప్రాణాల సంరక్షి ంచుకున్నారని అన్నారు. కామారెడ్డి ప్రజలలో ఆత్మస్థైర్యం నింపేందుకు ముఖ్యమంత్రి పర్యటించడం చాలా సంతోషంగా ఉందని, ఇక్కడే సమస్యలను శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు బ్రిడ్జి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఉన్నతాధికారు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇటి నర్సింహ

# రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడే జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోవాలి

## ఎంపిలకు సిపిఐ నేత ఇటి నర్సింహ విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** రాజ్యాంగం, ప్రాథమిక హక్కులను సమర్థించే ప్రతిపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పార్లమెంట్ సభ్యులకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ విజ్ఞప్తి చేశారు. నిరంకుశ, నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి రాజ్యాంగం, న్యాయవ్యవస్థలో అనుభవం ఉన్న వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి పదవికి అన్ని విధాల అర్హుడని ఆయన చెప్పారు. గురువారం సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వ ర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని జరుగుతున్న పోరాటంలో నిజాయితీగా ఆయన తన బాధ్యతను నిర్వహి స్తారని, గతంలో ఆయన న్యాయ మూర్తిగా ఉన్న సందర్భంలో ప్రజాస్వామ్య దృక్పథం కలిగి రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడటం కోసం తీర్పులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో అత్యంత విశిష్టమైన, ప్రగతిశీల న్యాయనిపుణులలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒకరన్నారు. ఇటీవల జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభలలో పార్టీ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.టి.నర్సింహను హైదరాబాద్ జిల్లా సమితి గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించింది.



సమావేశలో మాట్లాడుతున్న ప్రొ. జి.హరగోపాల్

# కాల్పుల విరమణతోపాటు మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

## ప్రజాస్వామికవాదుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ ఇప్పటికే 7,500 మంది ప్రముఖులు, పౌరులతో సంతకాలను సేకరించామని పలువురు ప్రజాస్వామిక వాదులు తెలిపారు. ఇంకా సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామన్నారు. పూర్వవిప్లవవిద్యార్థి వేదిక ఆధ్వర్యలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజాస్వామికవాదులు మాట్లాడారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ బిజెపి కూటమి తప్ప మిగతా అన్ని రాజకీయ పార్టీలు కూడా మావోయిస్తులతో శాంతిచర్చలు జరపాలని కోరుతున్నాయన్నారు. మావోయిస్టులు లేవదీసిన సామాజిక సమస్యలను పరిష్కారించాలేగాని, అణిచివేత పరిష్కారం కాదన్నారు. తెలంగాణ పౌర సమాజం అభిప్రాయాన్ని కూడగట్టడానికి పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రెండు నెలల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టందని ఆయన వివరించారు. మావోయిస్టులపై కాల్పుల విరమణ ప్రకటన చేయాలని ఆయన ప్రభుత్వాన్ని, ఆపెరేషన్ కగార్ నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, బిజెపేతర ఇతర రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కోరారు. దేశ పౌరులందరికి రాజ్యాంగం కలి ్పంచిన జీవించే హక్కును కాపాడటానికి కాల్పుల విరమణ ప్రకటించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని హరగోపాల్ విజ్ఞప్తి చేశారు. ప్రముఖులు సజయ్, నాగయ్య, ఎ.కె.ప్రభాకర్, మేల్కో మార్గరేట్, దొంతం చరణ్, రెహెమాన్, ప్రహ్లాద్, విరహత్‌అలీ, నరేష్‌కుమార్, అనుశ్రీ మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగంపైన ప్రమాణం చేసి, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, జీవించే హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు.



# సజ్జనార్ ఎన్నో సంస్కరణలు చేపట్టారు!

## ఆర్టీసి ఎండిగా నాలుగేళ్లు పూర్తిచేసుకున్న ఆయనకు ఉన్నతాధికారుల సన్మానం

**హైదరాబాద్ సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) వైస్ చైర్మన్, ఎండీగా విసి సజ్జనార్ పలు సంస్కరణలు తీసుకొచ్చారని ఆర్‌టిసి ఉన్నతాధి కారులు అన్నారు. సంస్కరణల మూలంగా ఆర్‌టిసి ముందుకు సాగుతోందని అన్నారు. సజ్జనార్ ఆర్‌టిసి వైస్ చైర్మన్, ఎండిగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌టిసి ఉన్నతాధికారులు, అధికారులు గురువారం అభినందనలు తెలిపారు. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురు వారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్, ఎండిగా సంస్థలో సజ్జనార్ ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమాలను ఉన్నతాధికారులు, అధికారులు గుర్తుచేసుకున్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 24వ ర్యాంక్

## ప్రభుత్వ మద్దతు, సిబ్బంది కృషి ప్రధాన కారణం

## ఉపకులపతి అల్దాస్ జానయ్య

**అత్తాపూర్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల పనితీరుపై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వే నివేదిక ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టి ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమవర్క్ -2025 గురు వారం విడుదల అయ్యింది. ఈ జాబితాలో దేశం లోని అన్ని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు, సంస్థల జాబితాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 24వ ర్యాంక్ ను సాధించింది. 2015 లో పీజెటీఏయూ ఆరవ ర్యాంక్ సాధించగా, 2023లో ఆ ర్యాంక్ 37కు పడిపోయింది.ఇప్పుడు పనితీరు మెరుగుపరుచుకుని 24 ర్యాంకు సాధించిందని పీజెటీఏయూ ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. దక్షిణాదిలోని అన్ని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో 4వ స్థానంలో పీజెటీఏయూ నిలవడం గర్వకారణమని జానయ్య అన్నారు. 10 నెలల క్రితం తాను పీజెటీఏయూ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అనేక కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఈ యేడాది ర్యాంకు మెరుగుపడిందని ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రత్యేకంగా 4 ఆధునిక



ఉపకులపతి అల్దాస్ జానయ్య

పరిశోధన కేంద్రాలు ప్రారంభించానన్నారు. సహజ వనరుల పరిరక్షణ, యూరియా, ఇతర రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు, నీటి సమర్థ యాజమాన్యం వంటి ముఖ్యమైన అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఖిఖిరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే వినూత్న కార్యక్రమాన్ని అమలుచేసి సుమారు 1200 గ్రామాల్లో 1,20,000 మంది రైతులని శాస్త్ర వేత్తలు ప్రత్యక్షంగా కలిసి ఆ అంశాలపై అవగాహన కల్పించారని జానయ్య వివరించారు. అలాగే సుమారు 11వేల గ్రామాల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకి నాణ్యమైన 40 వేల విత్తన కిట్లను పంపిణీ చేశామని జానయ్య పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ( ఐసీఏఆర్), ముఖ్యమంత్రి రేవంత్ ండ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు నిరంతర మార్గదర్శకత్వం, తోడ్పాటుతో ఈ ర్యాంకు సాధించగలిగామన్నారు. అదేవిధంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల కృషి, తోడ్పాటు ర్యాంకుల పెరుగుదలకు దోహదం చేసిందని జానయ్య అన్నారు. వారందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2026 లో 10వ ర్యాంకు, 2027లో 5వ ర్యాంకు సాధిస్తామని అల్దాస్ జానయ్య ధీమా వ్యక్తం చేశారు.

# జిఎస్‌టి తగ్గింపు.. సామాన్యులకు ఎంతో ఊరట

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** న్యూఢిల్లీలో జరిగిన 56వ వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) మండలి సమావేశంలో, దేశవ్యాప్తంగా సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జిఎస్‌టి స్లాబ్‌లను సులభతరం చేసి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగేలా జిఎస్‌టి ట్యాక్స్ తగ్గిస్తూ కౌన్సిల్ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. 12శాతం, 28శాతం పన్నుస్లాబ్‌లను పూర్తిగా రద్దు చేసిందని, 12శాతం స్లాబ్ రద్దు చేయడంతో, ఆ పరిధిలో ఉన్న అనేక నిత్యావసర వస్తువులు ఇప్పుడు 5శాతం స్లాబ్‌లలోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులపై జిఎస్‌టి శాతం జీరోకు తగ్గించబడిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో, జిఎస్‌టి రేట్ల తగ్గింపు ద్వారా సామాన్యులు, రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కల్పిస్తుందన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. మోడీ ప్రభుత్వం వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగల వేళ బహుమతిగా పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వస్తువులపై ట్యాక్స్ తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ స్వాగతిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని ఆత్మనిర్భర అభివృద్ధి

పరచిన భారత్‌గా తీర్చిదిద్దుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతమేదీ సాధించలేక, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు చేస్తుందన్నారు. మోడీ తల్లిని దూషించేలా చేసిన వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి జిఎస్‌టి తగ్గించినందుకు, పండుగ సమయంలో ఊరట ఇచ్చినందుకు బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పాలభిషేకం కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలోని భాగ్యనగరం గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరు రానున్నారు. మొజంజాహి మార్కెట్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానానికి అనుగుణంగా శోభాయాత్రలో పాల్గొని, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నారని తెలిపారు. భారతదేశం అమెరికా, రష్యా వంటి దేశాలపై ఆధారపడే దేశం కాదు. అమెరికా విధించే టారిఫ్ వల్ల ప్రపంచ దేశాలు భయపడుతున్నా, భారత్ మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియాను ముందుకు తీసుకుని జిఎస్‌టి రేట్లు తగ్గించిందన్నారు. తెలంగాణలో యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తుందని, మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అవసరమైన యూరియాను పంపిణీ చేస్తుందని, రాష్ట్రంలో బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోలేకపోతుందన్నారు.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలుచేయాలి

## సిఎంకు న్యాయవాదుల పోస్ట్‌కార్డుల ఉద్యమం

**హైదరాబాద్ సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా విన్నవించాలని రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేరి ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి భాశెట్టి కార్తీక్ లు న్యాయవాద సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యక్ష సమా వేశం లో వారు మాట్లాడుతూ రోజురోజుకు న్యాయవాదులపై దౌర్జన్యాలు జరువడమేగాక వారిని హత మారుస్తున్నారని ఆవేదనను వ్యక్త పరిచారు. న్యాయవాద వృతి లో భాగంగా న్యా యం కోసం పోరాడుతున్న న్యాయవాదుల ప్రా ణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలుపరచాలని డిమాండ్ చేశారు.




రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వ హించిన ప్రత్యక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాదులు

# రూ.4 కోట్ల విలువైన ఇంటిని యాదగిరీశుడికి విరాళమిచ్చిన భక్తుడు

## దాత ముత్తినేని వెంకటేశ్వర్లును అభినందించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** తిలక్‌నగర్ లో నాలుగు కోట్లకి పైగా విలువ చేసే ఇంటిని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామికి విరాళంగా అందజేశారు. గురువారం చిక్కడపల్లిలో సబ "రిజిస్ట్రార్ ఆఫీసులో దేవుడి పేరు మీదకు యాదగిరిగుట్ట ఇఒ వెంకటరావు సమక్షంలో ఆ భవంతిని ట్రాన్స్ ఫర్ చేయించారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి ముత్తినేని వెంకటేశ్వర్లు, తిలక్ నగర్ లోని తన సొంత ప్రాపర్టీ 152 గజాలలో నిర్మితమైన జీ+3, పెంట్ హౌస్ కలిపి ఉన్న ఇల్లు దేవస్థానానికి అందజేశారు.

రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత డాక్యుమెంట్లను ఆయన, ఈవో వెంటకరావుకి, టెంపుల్ చైర్మన్ నరసింహమూర్తి, దేవస్థాన అధికారుల సమక్షంలో దేవస్థానానికి అందజేశారు. ఈ సందర్భంగా ఈవో వెంకటరావు, దాత వెంకటేశ్వర్లును స్వామివారి కండువాతో సన్మానం చేశారు. స్వామివారి ప్రసాదం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి మీద భక్తితో విలువల ప్రాపర్టీని ట్రాన్స్ ఫర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడైనా టెంపుల్ వచ్చి ఆ స్వామి వారి ఆశీస్సు లు పొందవచ్చని చెప్పారు. స్వామివారి అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, దాత ముత్తినేని వెంకటేశ్వర్లును రాష్ట్ర దేవాదాయ శాఖ కొండా సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామాయ్యర్ ప్రత్యేకంగా అభినందించారు.

# బాలికపై అత్యాచారం కేసులో 22 యేళ్ల జైలు, జరిమానా

**చండూరు రూరల్.5(జర్నలిస్ట్‌ఫైల్):**మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దుండగుడికి కోర్టు 22 ఏళ్ళ జైలుశిక్షతో పాటు 35వేల జరిమాన విధించిన ఘటన మండల పరిధిలో దోనిపాముల గ్రామంలో చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపిన వివరాల ప్రకారం చండూరు మండలంలో గల దోనిపాముల గ్రామానికి చెందిన తిప్పర్తి యాదయ్య తండ్రి లింగయ్య,ఒక మైనర్ బాలికపై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడటం జరిగిందిజ బాధితురాలు తల్లి తేది 18 /12/2016 న ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితుడిపైన నసీఆర్‌నెం:139/2016 ఎస్పీ. పీఓసీఎస్ నెం : 214/2018 యూ/ఎస్ 452,506,376(1)(ఎన్) ఐపీసీ సెక్షన్ 5(హెచ్) ఆర్/డబ్ల్యూ 6 ఆఫ్ ఫోక్సో యాక్ట్2012 మరియు చండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా గురువారం రెండో అడిష నల్ కమ్ ఎస్సీ ఎస్టీ కోర్టు, అత్యాచారం, ఫోక్సో కేసుల కోర్ట్ నిందితునికి దోషిగా నిర్ధారించి, 1) సెక్షన్ ఐపీసీ ఫోక్సో చట్టం(సెక్షన్ 3 ఆర్/డబ్ల్యూ 4 ఆఫ్ ఫోక్సో యాక్ట్ 2012) ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా, 2) ఐపీసీ సెక్షన్ 4521 సంవత్సరం కారా గార శిక్ష మరియు రూ.5,000 జరినామ, 3) ఐపీసీ సెక్షన్ 506 (క్రిమినల్ ఇంటిమిడేషన్)కు గాను 1 సంవత్సరపు కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించగా మొత్తం కలిపి 22 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.35,000/జారీనామా బాధితురాలికి రూ.10 లక్షల రూపా యల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలు వడించిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్ తెలిపారు.

ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన సీఐ రమేష్ కుమార్,ఎస్సై భాస్కర్‌రెడ్డి అలాగే ప్రాసెక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డి.ఎస్.పి కె.శివరాం రెడ్డి, చండూరు సిఐ ఆదిరెడ్డి, యస్.ఐ నర్సింగ్ వెంకన్న, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్,డిడీవీ రామాంజనేయులు, లైజన్ అధికారులు, లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె.కల్పన, శి.నరేందర్, వి.మల్లికార్జున్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# సిఎం రేవంత్ కాళ్లు హరీశ్‌రావు మొక్కారనడం సరికాదు

## పద్మాదేవేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** కాళేశ్వరంపై శాసనసభలో బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ డొల్లతనాన్ని ఎండగట్టారని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ మాజీ సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి కాళ్లను హరీష్ రావు మొక్కారనడం బాధ కలిగించిందని, హరీష్ రావు గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కవిత రౌండ్‌టేబుల్ భేటీపెట్టినా పార్టీ నేతలకు సమాచారం ఇవ్వలేదని, రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కవిత ఉన్నారని మండిపడ్డారు. కెసిఆర్ కుమార్తెగా కవిత గౌరవాన్ని నిలుపుకోలేకపోయారని, కవిత తనకు తానే గొయ్యి తవ్వకున్నారని పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శలు గుప్పించారు.



బిసి భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, చిత్రంలో రాజ్ కుమార్, నీల వెంకటేష్ తదితరులు

# ఫీజు బకాయలు 6వేల కోట్లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** వారం రోజుల్లో కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయలు 6వేల కోట్లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుం దని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బిసి భవన్‌లో 14 బి.సి సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేలను ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి 14 బీసీ సంఘాలు ప్రతినిధుల సంతకాలతో లేఖ రాశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు, స్కీమును ప్రభుత్వం నిరక్ష ్యం చేయడం తగదన్నారు.ఫీజులు కట్టాలని విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 20 నెలల్లో రూ.20లు కూడా విడుదల చేయలేదని విమర్శించారు.ఏపీలో 1500 కోట్లు విడుదల చేశారు. మన రాష్ట్రంలో ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సమావేశంలో బిసి సంఘాల ప్రతినిధులు రాజ్‌కుమార్, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, రాజేందర్, మోడీ రాందేవ్, రేగుల మధుసూదన్ రావు, లింగయ్య యాదవ్, నిఖిల్ పటేల్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ ప్రజారాజ్యం కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్

# కెసిఆర్ కుటుంబం అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

## టిపిపి వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబ అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత కేవలం మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్‌కుమార్‌పైనే ఆరోపణలు చేసిందని, కేటీఆర్, కెసిఆర్‌లు కూడా అవినీతి అక్రమాలలో భాగస్వాములేనని ఆయన ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కల్వకుంట్ల కవితకు అవినీతి అక్రమాలు కనిపించలేదని, ఇప్పుడు నీతులు చెప్తుందని ఆయన ధ్వజం మెత్తారు. కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు కెసిఆర్ పాలనలో జరిగిన అన్ని అక్రమాలపై సమగ్రదర్యాప్తు జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఇసుక మాఫియాను నడిపించి ఎంతోమంది అమాయకుల ప్రాణాలు తీశారని దీనిపై కూడా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో బిజెపి నేతల భేటీ

## రజాకార్ సినిమా ప్రత్యేక ప్రదర్శనకు హాజరుకావాలని కోరిన నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబరు 17న నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్ర ఆధారంగా రూపొందిన రజాకార్ సినిమాను సెప్టెంబర్ 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో ప్రత్యేక ప్రదర్శనగా నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి హాజరు కావాలని గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కోరారు. గురువారం తెలంగాణ విమోచన కమిటీ సభ్యులు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ సి. అంజి రెడ్డి నేతృత్వంలోని బృందం గవర్నర్‌ను కలిసారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, గూడూరు నారాయణ్ రెడ్డి,గోలి మధుసూదన్ రెడ్డి, పి. విక్రం రెడ్డి, నందకం దివాకర్, పాతూరి కరుణ పాల్గొన్నారు. గవర్నర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామని విమోచన కమిటీ చైర్మన్ అంజిరెడ్డి తెలిపారు.

# ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా సేవా కార్యాక్రమాలు చేపట్టాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్షంలో భాగంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమంలో నిమగ్నం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు పిలుపు ఇచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ కోసం జన్మ ఇచ్చిన తల్లి కోసం ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, రక్తదాన శిబిరం వరకు అనేక సేవా కార్యక్రమాల గురించి వారికి వివరించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు సామాజిక, సేవా కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంస్థాగత చంద్రశేఖర్ తివారి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, శాసనమండలి సభ్యులు మల్కా కొమరయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, గీతామూర్తి, గణేష్ జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## వేలాది మంది భక్తులు వచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించడం హర్షణీయం

- జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష
- 45వ డివిజన్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**విజయవాడ, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**

స్థానిక 45వ డివిజన్‌లో జై దుర్గ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేసిన జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష ఆనందం వ్యక్తం చేశారు. "వేలాది మంది భక్తులు వచ్చి స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించడం నిజంగా హర్షణీయం. ఈ అవకాశం నాకు కల్పించిన కమిటీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు" అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జై దుర్గ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు, జనసేన కార్యకర్తలు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విపిఎస్ పబ్లిక్ స్కూల్‌లో టీచర్స్ డే వేడుకలు



**విజయవాడ, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**

మొగల్రాజపురం లోని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ,ఓనం , మిలాద్ ఉన్ నబి వేడుకలను గురువారం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని తెలుపుతూ , రాధాకృష్ణన్ చేసిన సేవలను కొనియాడుతూ ప్రసంగాన్ని ప్రారంభించారు. మనది మతాతీత రాజ్యం కాబట్టి ముస్లింలు జరుపుకునే మిలాద్ ఉన్ నబి పండుగను ప్రాముఖ్యతను వివరించి అలాగే మలయాళీలు జరుపుకునే ఓనం పండుగ వేడుకలను కూడా ఎంతో వేడుకగా చేశారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులు మలయాళీ నృత్యాన్ని ప్రదర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ , పండుగల విశేషాలను తెలిపే వేషధారణలో చిన్నారులు ఎంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య , వైస్ ప్రిన్సిపల్ రోజ్ మేరీ ,ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని విద్యార్థులను అభినందించి ,శుభాశీస్సులను అందించారు.

## ఎరువుల సరఫరా, సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్

### రైతుల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకునేందుకు ఏర్పాట్లు: ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**




ఎన్‌టీఆర్ జిల్లాలో ఖరీఫ్ – 2025 సీజన్‌కు సంబంధించి ఎరువుల సరఫరా, సమస్యలపై ప్రతి శుక్రవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని.. ఇందులో భాగంగా ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎరువులను రైతులకు సరఫరా చేయడం జరుగుతోందని.. ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఎరువులు సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అయినా అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు, పంపిణీ ఏర్పాట్లు, వరికి ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదులు, సమస్యలను 91549 70454 నంబర్‌కు ఫోన్‌చేసి నేరుగా కలెక్టర్‌కు తెలియజేయవచ్చన్నారు. రైతులతో పాటు డీలర్లు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు.. ఇలా ఎవరైనా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా కలెక్టర్‌తో నేరుగా మాట్లాడవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## ఒకే గ్రామంలో 23 మంది చనిపోతే ఏం చేస్తున్నారు

### వైద్య వ్యవస్థ ఏం చేస్తోంది?.. తురకపాలెం మరణాలపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహం

**అమరావతి, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**

ఒక గ్రామంలో 3నెలల వ్యవధిలో 23 మంది చనిపోతే క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య వ్యవస్థ ఏం చేస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు రూరల్ మండలం, తురకపాలెంలో చోటుచేసుకున్న వరుస మరణాలపై గురువారం ఆయన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ జి. రఘునందన్‌తో సమీక్ష జరిపారు. కేవలం వ్యవస్థాగత లోపాల కారణంగా ఇంత నష్టం జరిగిందని, స్థానిక ఏఎన్ఎంలు, మిగతా సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తురకపాలెం ఘటన నేపథ్యంలో సర్వైలెన్స్ (నిఘా) వ్యవస్థలో తగిన మార్పులు చేయాలన్నారు. కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ప్రత్తిపాడు శాసన సభ్యుడు బూర్ల రామాంజనేయులు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మితో కలసి గురువారం కమిషనర్ వీర పాండియన్ ఆ గ్రామంలో పర్యటించారు. ఉచిత వైద్యశిబిరాన్ని పరిశీలించి బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను, పరీక్షల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం తమకు కేటాయించిన ట్యాంకు, సంపు కలుషితమయ్యాయని అధికారులకు స్థానికులు తెలిపారు. తమ గ్రామానికి వచ్చే రహదారుల్లో దుష్ట శక్తులు ప్రవేశించకుండా గవిడి రాళ్లను ఏర్పాటు చేసుకున్నామని, వీటిలో దక్షిణ దిశలో ఉన్న గవిడి రాయి పక్కకు ఒరిగి పోయిందని, అందుకే చావులు కొనసాగుతున్నాయని చెప్పారు.

# ఈనెల 7వ తేదీన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష

- పరీక్షకు హాజరుకానున్న 6593 మంది అభ్యర్థులు
- పరీక్ష నిర్వహణకు 17 కేంద్రాలు
- డిఆర్‌ఓ ఎం. లక్ష్మీ నరసింహం



**విజయవాడ, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా రెవె న్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణకు చేపట్టవ లసిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డిఆర్‌ఓ ఎం. లక్ష్మీ నరసింహం, ల్కెజన్ ఆఫీసర్లు, ఛీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ఈనెల 7వ తేది ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష ఆఫ్ ల్కెన్ ఓఎంఆర్ ఆధారితంగా జరగనున్నాయన్నారు. ఈ పరీక్షకు నగరంలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షలకు 6,593 అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. 17 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 17 మంది ల్కెజన్ ఆఫీసర్లను నియమించామన్నారు. 7వ తేదీ ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష నిర్వహణలో ఛీఫ్ సూపరింటెండెంట్ల పాత్ర కీలకమని ఈనెల 6వ తేదిన ఇన్విజలేటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో సంబంధిత తహాశీల్దార్లు, 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుండి సా. 6 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా ఏపిసిపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవరస మందులతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని, త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష వ్రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసి పరీక్షా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని డిఆర్‌ఓ ఎం. లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ సిహెచ్ సాయి ప్రకాష్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరిండెంట్ ఎస్.సలీం, సంబంధిత అధికారులు ఉన్నారు.





## గురువుల సేవకు విద్యార్థులు కృతజ్ఞతలు

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**

గురుపూజోత్సవం కార్యక్రమంను పురస్కరించుకొని జెడ్పీహెచ్ఎస్ స్కూల్ కొటికలపూడి పాఠశాల నందు ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీహెచ్ఎస్ కొటికలపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.వి.మాలిని అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎస్బిఐ ఇబ్రహీంపట్నం మేనేజర్ వంశీ హాజరయ్యారు. ఫీల్డ్ ఆఫీసర్ అరోరా ఈ కార్యక్రమ నిర్వహణలో భాగంగా ప్రధానోపాధ్యాయికి మాట్లాడుతు ఎన్నో ఆవిష్కరణలకు మూలం గురువు విద్యార్థి మదిలో వెలిగించిన జ్ఞానజ్యోతి కారణం అని అటువంటి గురువులను గౌరవించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు వల్లెపు నరేంద్ర ఉపాధ్యాయులు తరుపున పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలినిని ఘనంగా సత్కరించడం జరిగింది. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావుని సత్కరించటం జరిగింది.అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఉపాద్యాయులందరిని పుష్పకుచ్ఛిలతో సత్కరించి వారి ఆశీస్సులు పొందటం జరిగింది. ముఖ్యఅతిథి ఎస్బిఐ మేనేజర్ పాఠశాలలో ఉపాధ్యాయులందరిని సత్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లెపు నరేంద్ర,షేక్ ఖసిం, శ్రీనివాసరావు,నరసింహారావు,మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం

### జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష

**విజయవాడ, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**



డివిజన్‌లో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తానని జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష తెలిపారు. గురువారం 42వ డివిజన్ లోని 300, 450 బ్లాక్స్ నందు డ్రైనేజ్ పైపు పగిలి మురికి నీరు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు తెలియజేయగా వెంటనే జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష స్పందించారు. వెంటనే వీఎంసీ సిబ్బందిని పిలిపించి దగ్గరుండి మరి డ్రైనేజీ పైపు మార్పించారు. అదేవిధంగా వర్షాకాలంలో వస్తున్నటువంటి ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని డివిజన్ లోని పలు మ్యాన్ హోల్స్ లోని పూడికలు కార్పొరేషన్ సిబ్బంది తో మాట్లాడి సమస్యని పరిష్కరించారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు

- కృత్రిమ కొరత సృష్టికి అధికారులదే బాధ్యత
- దుకాణాల వద్ద ఎరువుల అమ్మకాలను నిరంతరం పర్యవేక్షించాలి
- సిబ్బంది స్వయంగా దుకాణాల వద్ద రైతులకు అందుబాటులో ఉండాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎ.కొండూరు, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్‌ఫైల్):**



రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన ఎరువులను సరఫరా చేయడం జరిగిందని.. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎక్కడైనా కృత్రిమ కొరత ఉందనే సంఘటనలు ఎదురైతే అందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని.. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద స్వయంగా అన్నదాతలకు సహాయకారిగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలో ఎరువుల సరఫరా స్థితిగతులపై గురువారం ఉదయం వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీల్లో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ.. ఎ.కొండూరు మండలం, కంభంపాడు గ్రామంలో గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు, సరఫరా కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు.. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో పటిష్ట సమన్వయంతో పనిచేస్తూ లోటుపాట్లకు తావులేకుండా చూడాలని, అంతిమంగా ఏ రైతూ ఎక్కడా ఇబ్బంది పడకూడదని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

### యూరియా, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించండి

విచ్చలవిడిగా ఎరువుల వినియోగం వల్ల పంటతో పాటు నేల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని.. పంటకు ఏ దశలో ఎంత మోతాదు యూరియా వేయాలనే దానిపై అన్నదాతలకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా ప్రకారం... వరి నాటు వేసినప్పుడు ఒకటో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 60 రోజులకు మూడో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. రెండు, మూడో విడతల్లో అధిక దిగుబడులకు, పర్యావరణ పరిరక్షణకు, నేల సారాన్ని కాపాడుకునేందుకు యూరియాకు బదులు నానో యూరియాను స్ప్రే చేసుకోవచ్చని.. ఇందుకు అవసరమైన డ్రోన్లను సమకూర్చేందుకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# భారత్, సింగపూర్ సంబంధాలు బలోపేతం



ప్రధాని మోడీతో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ భేటీ
ఆధునిక సాంకేతికత దిశగా ఉభయదేశాల పయనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోం దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీస్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోడీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా ప్రధానిమోడీ మాట్లాడుతూ, 'భారత్ యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దు తామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐపేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షిం చాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.



## సిసికెమెరాల పనితీరుపై సుప్రీం సుమోటో పిల్ విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశ వ్యాప్తంగా ఉన్న పలు పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు పని చేయకపోవటం లేదంటూ తాజాగా వెలువడిన వార్తా కథనాలపై సుప్రీంకోర్టు స్పందించింది. వెలువడింది. ఇందుకోసం సుమోటోగా పిల్‌ను స్వీకరించి సుమోటో పిల్ విచారణ చేపట్టడానికి సిద్ధమైంది. ఈ ఏడాది ఎనిమిది నెలల్లో ఒక్క రాజస్తాన్‌లోనే 11 పోలీస్ కస్టడీ మరణాలు సంభవించాయని బెంచ్‌లోని న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సుమోటోగా పిల్‌ను స్వీకరించినట్లు తెలిపారు. 2020లోనే కీలక ఆదేశాలు జారీచేసిన సుప్రీం కోర్టు వాటి అమలును పునఃపరిశీలనచేసింది. నైట్ విజన్, ఆడియో రికార్డింగ్ ఉన్న సీసీటీవీ కెమెరాలను మాత్రమే వాడాలని స్పష్టం చేసింది. సీసీటీవీ ఫుటేజీ రికార్డులను కనీసం 18 నెలలపాటు భద్రపరచాలని తెలిపింది. కస్టోడియల్ వేధింపులు, మరణాలకు సంబంధించిన దర్యాప్తు సమయంలో ఆ సీసీటీవీ కెమెరాల రికార్డులు అందుబాటులో ఉండేలాగా చూసుకోవాలని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదే. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా దేశవ్యాప్తంగా ఉన్న చాలా పోలీస్ స్టేషన్లు పని చేయని సీసీటీవీ కెమెరాలతోటే కాలం వెళ్లదీస్తున్నాయి. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేక దర్యాప్తునకు ఆటంకం ఏర్పడుతోంది. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేకపోవటం, టెక్నికల్ సమస్యలు దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నాయని పోలీస్ ఏజెన్సీలు తరచుగా చెబుతూ ఉన్నాయి.

## పౌరసత్వం రాకముందే సోనియాకు భారత్‌లో ఓటు హక్కు

### ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కేసు దాఖలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. సోనియా గాంధీ పేరును 1980లో ఓటర్ల జాబితాలో చేర్చారని, 1983లో ఆమె భారత పౌరసత్వం పొందారని పిటిషనర్ పేర్కొన్నారు. భారత పౌరసత్వం పొందే ముందు ఓటరు హోదాను పొందేందుకు నకిలీ పత్రాలను సృష్టించారని ఆరోపించారు. గురువారం అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా పిటిషన్‌పై వాదనలు ఆలకించారు. ఆ తర్వాత సెప్టెంబర్ 10న తదుపరి విచారణకు ఆదేశించారు. ఈ పిటిషన్‌ను న్యాయవాది వికాస్ త్రిపాఠి దాఖలు చేశారు. 1983 ఏప్రిల్‌లో సోనియా భారత పౌరురాలు కావడానికి ముందే ఆమె ఓటు ఎలా వేయగలిగారనే దానిపై విచారణ చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు అనిల్ సోని, పవన్ నారంగ్ ఫిర్యాదుదారుడి తరపున హాజరయ్యారు. మొదట ఇటాలియన్ పౌరురాలు అయిన సోనియా గాంధీ



1983 ఏప్రిల్ 30న పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5 కింద భారతీయ పౌరురాలు అయ్యారు. అయితే ఆమె పేరు 1981-82 నాటికే న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కనిపించింది. ఆ సమయంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాల గురించి ప్రశ్నలు తలెత్తాయి. 1982లో సోనియాతోపాటు ఆమె దివంగత మరిది సంజయ్ గాంధీ పేరును ఎన్నికల జాబితా నుంచి తొలగించారని న్యాయవాది నారంగ్ ఎత్తి చూపారు. అలాంటి తొలగింపు ఆమె మునుపటి ఓటర్ల జాబితాలో నమోదు సక్రమంగా లేదని సూచిస్తుందని తెలిపారు. ఎందుకంటే భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులు అని ఆయన వాదించారు. పిటిషన్ పత్రాలను ఉటంకిస్తూ, ఆమెకు పౌరసత్వం మంజూరు చేయడానికి ముందు నకిలీ లేదా తప్పుడు పత్రాలను ఉపయోగించి ఓటర్ల జాబితాలో చేర్చి ఉండవచ్చని ఆరోపించారు. ఒక ప్రభుత్వ అధికారిని తప్పుదారి పట్టించారని, మోసం జరిగినట్లు కనిపిస్తోందని కోర్టుకు తెలిపారు. పోలీసుల విచారణకు అర్హమైన కేసు, అది నేరమని ఆయన చెప్పారు. ఢిల్లీ పోలీసులు, సీనియర్ అధికారులను సంప్రదించినప్పటికీ, ఎటువంటి చర్య తీసుకోలేదని, పిటిషనర్ కోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాదించారు. అందువల్ల, ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆరోపించిన నేరాలపై దర్యాప్తు కోసం దిశానిర్దేశం చేయాలని పిటిషనర్ కోరుతున్నట్లు తెలిపారు. 1985 అలహాబాద్ హైకోర్టు రాకేష్ సింగ్ వర్సెస్ సోనియా గాంధీ కేసులో ఇచ్చిన తీర్పుపై కూడా పిటిషన్ ఆధారపడి ఉందని చెప్పారు. 1983ఏప్రిల్ 30న రిజిస్ట్రేషన్ ద్వారా భారత పౌరురాలిగా మారిందని కోర్టు అప్పుడు తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పిటిషన్ ఆ తేదీకి ముందు జరిగిన ఓటరు నమోదు చట్టవిరుద్ధమని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాలను దర్యాప్తు చేయడానికి, రికార్డులను పరిశీలించడానికి పోలీసులను ఆదేశించాలని పిటిషనర్ కోర్టును కోరారు.

## ట్రంప్‌తో అలాస్కా చర్చలనే మోడీకి వివరించా..

### కారులో గుసగుసలపై స్పందించిన పుతిన్

**మాస్కో సెప్టెంబరు 5:** షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే కారులో ప్రయాణిస్తూ మాట్లాడుకున్న విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ ఏకాంత భేటీలో వారిద్దరూ ఏం చర్చించుకున్నారనే దానిపై నెలకొన్న ఉత్కంఠకు పుతిన్ తాజాగా తెరదించారు. ఆ సంభాషణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావన వచ్చినట్లు ఆయన వెల్లడించారు. చైనా పర్యటన ముగించుకున్న అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి, మోడీతో కారులో జరిగిన సంభాషణ



గురించి ప్రశ్నించగా, అందులో దాచిపెట్టాల్సిన రహస్యమేమీ లేదు. అలాస్కాలో డొనాల్డ్ ట్రంప్‌తో నాకు జరిగిన చర్చల గురించి ప్రధాని మోదీకి వివరించానని పుతిన్ స్పష్టం చేశారు. ఇటీవల ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశంపై పుతిన్, ట్రంప్ అలాస్కాలో సమావేశమయ్యారు. ఆ భేటీ వివరాలను కూడా పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ కేవలం 30సెకన్ల పాటు బ్రోకెన్ ఇంగ్లీష్ లోనే జరిగిందని తెలిపారు. 'ట్రంప్‌ను ఆరోగ్యంగా చూసినందుకు సంతోషంగా ఉందని ఆయనతో చెప్పానని పుతిన్ పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా పుతిన్ తన కాన్వాయ్‌తో వచ్చి, మోదీ కోసం దాదాపు పది నిమిషాలు వేచి చూశారు. అనంతరం మోదీని తన కారులోనే సదస్సు ప్రాంగణానికి తీసుకెళ్లారు. దాదాపు 45 నిమిషాల పాటు ఇరువురు నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ వర్గాలు అప్పట్లో తెలిపాయి. ఈ ప్రయాణం తర్వాత మోడీకూడా వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో చర్చలు ఎప్పటిలాగే అద్భుతంగా సాగాయని పేర్కొన్నారు. అమెరికా సుంకాల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం.

## అమరత్వం,ఆయుష్షులపై జిన్‌పింగ్ పుతిన్‌ల ముచ్చట్లు


### అంతర్జాతీయ మీడియాలో వీరి చిట్‌చాట్ వైరల్



**బీజింగ్, సెప్టెంబరు 5:** ప్రపంచ రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతలుగా ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. మనిషి ఆయుష్షు, అమరత్వం వంటి అంశాలపై వారిద్దరూ మాట్లాడుకోవడం చర్చనీయాంశం అయింది. చైనా రాజధాని బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్‌లో నిన్న జరిగిన సైనిక పరేడ్‌ను చూడటానికి వెళుతున్న సమయంలో ఈ ఇద్దరు నేతల మధ్య ఈ మాటామంతీ నడిచింది. ఈ సంభాషణలో పుతిన్ మాట్లాడుతూ, బయోటెక్నాలజీ అభివృద్ధి వల్ల అవయవ మార్పిడులు సర్వసాధారణ మవుతాయని, దాని ద్వారా యవ్వనంగా ఉంటూ అమరత్వం సాధించవచ్చని వ్యాఖ్యానించారు. దీనికి జిన్‌పింగ్ స్పందిస్తూ, ఈ శతాబ్దంలో మానవులు 150 ఏళ్ల వరకు జీవించగలరనే అంచనాలు ఉన్నాయని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సమయంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారిని చూసి నవ్వుతూ కనిపించినప్పటికీ, వారి సంభాషణలో పాలుపంచుకున్నారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఈ భారీ ఆయుధ ప్రదర్శనను నిర్వహించింది. దాదాపు 50 వేల మంది సందర్శకుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచానికి యుద్ధం కావాలో, శాంతికావాలో తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి ముందు జరిగిన షాంఘై సహకార సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు 20 దేశాల అధినేతలు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, జిన్‌పింగ్ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతంచేసే దిశగా 20 ఒప్పందాలపై సంతకాలు చేశారు. కృత్రిమ మేధ, గ్యాస్ పైప్‌లైన్ సహా పలు రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు.

## ఎనిమిదేళ్లకు మోడీ ప్రభుత్వానికి జ్ఞానోదయం

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** జీఎస్టీ సంస్కరణల విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జ్ఞానోదయం కలిగిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లకు కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణ నిద్ర వీడి మేల్కొనడం మంచి విషయమేనంటూ ఆయన గురువారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జీఎస్టీ కౌన్సిల్ ఇటీవల పన్ను స్లాబులలో కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గత దశాబ్ద కాలంగా జీఎస్టీని సరళీకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని ఖర్గే గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే పన్ను అనే నినాదాన్ని ఒకే దేశం, 9 పన్నులుగా మార్చేసిందన్నారు. సరళమైన పన్నుల విధానంతో జీఎస్టీ 2.0ను తాము 2019, 2024 మేనిఫెస్టోల లోనే ప్రతిపాదించామని తెలిపారు. ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోడీనే జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారని ఖర్గే ఆరోపించారు. 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్‌ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ అడ్డుపడింది. కానీ ఇవాళ అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగాయని సంబరాలు చేసుకుంటోంది. సామాన్యుల నుంచి పన్నులు వసూలు చేయడం గొప్ప ఘనత అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. వసూలవుతున్న మొత్తం జీఎస్టీలో 64 శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుంచే వస్తోందని, కేవలం 3 శాతం మాత్రమే కుబేరుల నుంచి వస్తోందని ఆయన ఆరోపించారు. తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశం ఉన్నందున, 2024-25ను ఆధార సంవత్స రంగా తీసుకుని ఐదేళ్లపాటు పూర్తి పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే, సంక్లిష్టమైన జీఎస్టీ నిబంధనలను తొలగిస్తేనే ఎంఎస్ఎంఇరంగానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## టారిఫ్ వార్ నిలిపివేయక పోతే భారీ మూల్యం తప్పదు

### అమెరికాకు శశిథరూర్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** భారత్‌తో అనుసరిస్తున్న సుంకాల యుద్ధాన్ని అమెరికా తక్షణమే విరమించుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హెచ్చరించారు. ఒకప్పుడు చైనాను ఎవరు కోల్పోయారు అని వాషింగ్టన్‌లో చర్చ జరిగినట్టు, భవిష్యత్తులో భారత్‌ను ఎవరు కోల్పోయారని బాధపడే పరిస్థితిని తెచ్చుకోవద్దని అని ఆయన అమెరికాకు హితవు పలికారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలు ఇరు దేశాలకే కాక, ప్రపంచానికి కూడా మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఆంగ్ల పత్రికలో రాసినవ్యాసంలో శశిథరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ నుంచి దిగుమతులపై అమెరికా 50శాతం వరకు సుంకాలు విధించడం,ముఖ్యంగా రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకం వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

## భారత్, చైనాలపై యుఎస్ స్వరం సరికాదు

### రష్యా అధినేత పుతిన్

**మాస్కో, సెప్టెంబరు 5:** భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్-అమెరికాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలపై అమెరికా చర్యలు సరైనవి కావన్నారు. ఎస్ఇఒ సదస్సు, మిలిటరీ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆయన చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రంప్ పరిపాలన ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులనూ అణగదొక్కేందుకు ఆర్థిక ఒత్తిడిని ఒక సాధనంగా ఉపయోగిస్తుందని ఆరోపించారు. భారత్-చైనాలు భాగస్వాములని పేర్కొంటూ వీరి ద్వైపాక్షికాన్ని ట్రంప్ బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారు. '1.5 బిలియన్ల మంది జనాభా కలిగిన భారత్, చైనాలు శక్తిమంతమైన ఆర్థిక వ్య



వస్థలు. ఆయా దేశాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థలు, దేశీయ చట్టాలు ఉన్నాయి. టారిఫ్‌లతో వారిని శిక్షించే ప్రయత్నాలు చేస్తే అవి ఆ దేశ నాయకులను క్లిష్టతరంలోకి నెట్టేస్తాయి. ఈ క్రమంలో వారిలో ఎవరైనా బలహీనపడితే.. అతని రాజకీయ జీవితం ముగిసిపోతుంది. ఇరు దేశాల చరిత్రలో వలసవాదం వంటి కష్టతరమైన కాలం నడిచింది. వారి సార్వభౌమాధికారంపై చాలాకాలం పాటు పన్ను విధించారు. ఇప్పుడు వాటన్నింటికీ కాలం చెల్లింది. ఇంకా వాటిని అణగదొక్కేలా మాట్లాడటం సరైనది కాదు. భాగస్వాములతో మాట్లాడేప్పుడు సరైన పదాలు ఉపయోగించాలి' అని పుతిన్ పేర్కొన్నారు. కాగా ఈ ఉద్రిక్తతలు త్వరలో ముగుస్తాయన్నారు. మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ క్రమంలో అమెరికాలోని కొందరు నాయకులు భారత్‌పై నోరు పారేసుకుంటున్నారు.దీంతో ఇరు దేశాల మధ్యసంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే, భారత్‌పై విధించింది సెకండరీ సుంకాల మాత్రమేనని ట్రంప్ అన్నారు. ఆ దేశంపై రెండు,మూడు విడతలు ఉన్నా యన్నారు.ఈ క్రమంలోభారత్‌తో కలిసే ఉన్నా మంటూనే ఆదేశం ప్రపంచంలోనే అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందని ఆరోపించారు.



## టారిఫ్‌ల కేసు విచారణ తక్షణమే జరపండి

### 'సుప్రీం'ను ఆశ్రయించిన అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** ప్రపంచ దేశాలపై ఇబ్బడిముబ్బడిగా పన్నులు విధించేందుకు బ్రేకులు పడుతుండటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫెడరల్ చట్టం ప్రకారం అధ్యక్షుడికి దిగుమతులపై సుంకాలు విధించే హక్కు ఉందని పేర్కొంటూ ఈ కేసును అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది. ఎమర్జెన్సీ అధికార చట్టం ప్రకారం ట్రంప్ సుంకాలు విధించారని ఇటీవల అప్పీల్స్ కోర్టు తీర్పునిచ్చింది. ఆ సుంకాలు చట్ట విరుద్ధమని పేర్కొనడంతో ట్రంప్ యంత్రాంగం తాజాగా సుప్రీం తలుపుతట్టింది. దీనిపై గురువారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నవంబరు ప్రారంభంలోనే ఈ కేసుపై వాదనలు వినాలని సొలిసిటర్ జనరల్ డి.జాన్ సావర్ న్యాయమూర్తిని కోరారు. 'అప్పీల్స్ కోర్టు నిర్ణయం అధ్యక్షుడు ఐదు నెలలుగా విదేశాలతో కొనసాగిస్తున్న చర్చలను అనిశ్చితిలోకి నెడుతుంది. ఇప్పటికే పూర్తయిన చర్చలను, జరగబోయే చర్చలను ప్రమాదంలో పడేస్తుంది' అని వ్యాఖ్యానించారు. ఈ వాదనను లిబర్టీ జస్టిస్ సెంటర్ వ్యాజ్య డైరెక్టర్, సీనియర్ న్యాయవాది జెఫ్రీ ష్వాబ్ తోసిపుచ్చారు. 'చట్టవిరుద్ధమైన సుంకాలు చిన్న వ్యాపారాలకు తీవ్ర హానీ కలిగిస్తున్నాయి. వాటి మనుగడ ప్రమాదంలో పడుతోంది. ఈ కేసులో మా క్లయింట్లకు సత్వరం పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై వ్యాపారవర్గాలు ఇప్పటికే రెండు న్యాయస్థానాల్లో పైచేయి సాధించాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించడంతో ప్రపంచ మార్కెట్లు వణికిపోయాయి. అమెరికాతో దూరం పాటిస్తున్న దేశాలు, మిత్ర దేశాలు ధరలు పెరుగుతాయని, ఆర్థికవృద్ధి మందగిస్తుందని భయాందోళనకు గురయ్యాయి. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకుండా పన్నులతో ఐరోపా యూనియన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షల మోత మోగించలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే సెకండరీ సుంకాలను విధించానని, రెండు, మూడు విడతలను చేపట్టలేదని స్పష్టం చేశారు. సుంకాలతో అమెరికాను భారత్ చంపేస్తోందని ఆరోపించారు.

## వారు ఏకమవుతున్నారు.. సిద్ధంగా ఉండండి

### పెంటగాన్‌కు యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధినేత జోంగ్‌ఉన్ ఒకే వేదికపై కనపించడం అమెరికా అగ్రనేత ట్రంప్‌ను కలవరపాటుకు గురిచేసింది. అవసరమైతే చైనా, రష్యాలను అడ్డుకొనేందుకు సిద్ధంగా ఉండాలని పెంటగాన్‌ను ఆయన ఆదేశించారు. అమెరికా సేనల్లో భారీ స్థాయిలో మా ర్పులు చేయాలని సూచించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ తనకు ట్రంప్ నుంచి ఈ మేరకు ఆదేశాలు వచ్చినట్లు అంగీకరించారు. మిలిటరీలో భారీ పునర్వ్యవస్థీకరణను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేమీ యుద్ధం కోరుకుంటూ చేసేది కాదని వివరణ ఇచ్చారు. చైనా, రష్యా మరేదైనా దేశం విషయంలో తమ పాలసీ స్పష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం బీజింగ్‌లో విక్టరీ డే పెరేడ్ సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన తర్వాత ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. చైనా, ఉత్తర కొరియా, రష్యా దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతు న్నాయన్నారు. కానీ, అవి ఎటువంటివో మాత్రం ఆయన వెల్లడించలేదు. చైనాను విదేశీ పాలకుల నుంచి విడిపించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ గుర్తిస్తారా, లేదా అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

### జిఎస్టీ తగ్గించేందుకు ఎనిమిదేళ్లు పట్టిందా?: చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** కేంద్ర ప్రభుత్వం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఎనిమిదేళ్లు ఎందుకు పట్టిందంటూ ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది ఎనిమిదేళ్ల ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్‌మీడియా వేదికగా చిదంబరం స్పందిస్తూ ప్రస్తుత జీఎస్టీ విధానాన్ని, ఇప్పటిదాకా ఉన్న రేట్లను మొదట్లోనే ప్రవేశపెట్టి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. 2017లో జీఎస్టీని తీసుకొచ్చినప్పటి నుంచి తాము దీని డిజైన్, రేట్లపై హెచ్చరిస్తున్నా ప్రభుత్వం తమ మాటలను పెడచెవిన పెట్టిందని ఆయన ఆరోపించారు. ఇంతకాలం తర్వాత ప్రభుత్వం హఠాత్తుగా ఈ మార్పులు చేయడానికి గల కారణాలపై ఆయన పలు అనుమానాలు వ్యక్తంచేశారు. మందగించిన ఆర్థికవృద్ధి, పెరుగుతున్న కుటుంబ అప్పులు, పడిపోతున్న పొదుపు, త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికలు లేదా అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి, వీటన్నింటిలో ఏదో ఒక కారణం ఉండి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

### ప్రారంభించిన వెంటనే సముద్రంలో మునిగిన పర్యాటక నౌక



**అంకారా, సెప్టెంబరు 5:** తుర్కియేలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.కొత్తగా నిర్మించి ప్రారంభించిన నిమిషాల్లోనే ఓ లగ్జరీ నౌక సముద్రంలో మునిగిపోయింది. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన జోంగుల్డక్ తీరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.దాదాపు పది లక్షల డాలర్లతో ఈ లగ్జరీ నౌకను నిర్మించారు. దీని ఖరీదు భారత కరెన్సీలో దాదాపు 8.74 కోట్లన్నమాట. 24 మీటర్ల పొడవున్న ఈ లగ్జరీ నౌకకు 'డోల్స్ వెంటో' అని పేరు పెట్టారు. తుర్కియేలోని మెడ్ యిల్మాజ్ షిప్‌యార్డ్‌లో ఈ నౌక‌ను గ్రాండ్‌గా ప్రారంభించారు. కొంత మంది ప్రయాణికులు, సిబ్బందితో నౌక సముద్రంలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అయితే ప్రారంభమైన 15 నిమిషాలకే ఈ నౌక సముద్రంలో మునిగి పోయింది. ఊహించని ఈ ఘటనతో భయాందోళనకు గురైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే సముద్రంలోకి దూకేశారు. అనంతరం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. యజమాని, కెప్టెన్ కూడా సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.

### నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులు చేస్తున్న పాక్

**కరాచి, సెప్టెంబరు 5:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో దెబ్బతిన్న కీలకమైన నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులుచేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న అన్ని ఎయిర్‌బేస్‌లను పాక్ ఇప్పుడు పునర్నిర్మిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం జరిపిన దాడుల్లో ధ్వంసమైన నూర్‌ఖాన్ ఎయిర్ బేస్ పునర్నిర్మాణ పనులు చేపడుతోంది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్స్ ఉన్న రావల్పిండిలో ఈ ఎయిర్‌బేస్ ఉంది. అంతేకాదు



దేశ రాజధాని ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అందుకే ఈ ఎయిర్‌బేస్ రాజకీయంగా, సైనిక పరంగా ఎంతో సున్నితమైందిగా చెప్తారు. అన్ని ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లకు ఈ వైమానిక స్థావరమే అడ్డా.

### లారీని ఢీకొన్న కారు: ఐదుగురు వ్యాపారులు మృతి



**పాట్నా, సెప్టెంబరు 5:** వేగంగా వెళ్తున్న కారు లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. అందులో ప్రయా ణించిన ఐదుగురు వ్యాపారులు ఈ ప్రమాదంలో మరణించారు. ఈసంఘటన బీహార్‌లో జరిగింది. రాజధాని పాట్నాతో పాటు పరిసర జిల్లాల్లో పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్న వీరు బిజినెస్ పని కోసం ఫతుహాకు కారులోవెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాట్నాకు తిరిగి వస్తున్నారు. పర్సా బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుయా మోర్ సమీపంలో జాతీయ రహదారి నంబర్ 83పై వేగంగా వెళ్తున్న ఆ కారు లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం లారీ కిందకు చొచ్చుకెళ్లి ఇరుక్కు పోయింది. పెద్ద శబ్దం విన్న స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. గ్యాస్ కట్టర్లు, క్రేన్ సహాయంతో రెండు గంటలు శ్రమించిన తర్వాత మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు.

## విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): "ఉపాధ్యాయులే సమాజానికి దీపస్తంభాలు.. వారి మార్గదర్శకత్వం వలననే విద్యార్థులు పెద్ద వ్యక్తులుగా ఎదుగుతారు" అని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, విద్యా రంగం అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో విద్యా రంగం మరింత బలోపేతం అవుతుందని ఆమె నమ్మకం వ్యక్తం చేశారు. క్రిస్టినా చేతుల మీదుగా 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులు సత్కారం పొందారు. ఉపాధ్యాయుల కృషి వల్లే రాష్ట్రం భవిష్యత్తు వెలుగొందుతుందని ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కమిషనర్ పులి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల హోల్‌సేల్ విక్రయాలపై హెచ్చరిక



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని, రైతులు కేవలం ఈ మార్కెట్‌లోనే కూరగాయల క్రయవిక్రయాలు జరపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరంలో అనుమతి లేని ప్రాంతాల్లో కూరగాయల విక్రయాలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలో, అన్నపూర్ణ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో రాత్రివేళలలో అనధికారికంగా హోల్‌సేల్ కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయన్నారు. అనుమతి లేని హోల్‌సేల్ మార్కెట్ కార్యకలాపాలు చట్టప్రకారం నిషేధమని, రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులు, జాతీయ రహదారి నిర్వహణ విభాగం, మార్కెటింగ్ శాఖ దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లామని, ఇకపై రైతులను తప్పుదోవ పట్టించే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉత్తమ గురువుగా తుపాకుల శ్రీనివాసులు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఎస్జిటీ ఉపాధ్యాయుడిగా పని చేయుచున్న తుపాకుల శ్రీనివాసులు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వార్డు అందుకోవడం జరిగింది. జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఎమ్మెల్సీలు రామ్ గోపాల్ రెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఈ అవార్డును ప్రధానం చేశారు. శ్రీనివాసులుకు అవార్డు రావడంతో తోటి ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని స్నేహితులు బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ,ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## యోగా టీచర్లకు ఘన సన్మానం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): పెదవడ్లపూడి బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంటర్లోని మండల పరిషత్ యూపీ స్కూల్లో అన్నే పద్మలత, వెలగపూడి శ్యామల ఆధ్వర్యంలో మహిళల యోగశిక్షణా శిబిరం కొనసాగుతోంది. శిబిరంలో శుక్రవారం టీచర్స్ డే ని పురస్కరించాలని యోగ సాధకులు యోగా టీచర్స్ ను సత్కరించారు. ముఖ్యఅతిథిగా గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్ హాజరయ్యారు. నిర్వాహకులు పద్మలత, శ్యామల యోగ టీచర్స్ కీర్తి యోగి రంగ లత, లింగినేని మణి లను శాలువాలతో ఘనంగా సత్కరించి, నూతన వస్త్రాలను బహుకరించారు. యోగ సాధకులు పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# గురువులే సమాజ నిర్దేశకులు : ఎమ్మెల్యే నసీర్

- కూటమి ప్రభుత్వంలో గురువులకు సముచితస్థానం
- వైసీపీ పాలనలో ఉపాధ్యాయులకు నిత్య వేధింపులు
- మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి
- గురు పూజోత్సవ కార్యక్రమాల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గురువులే సమాజ నిర్దేశకులని, భావిభారతావని నిర్మాతలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాలతోపాటు ఇతర స్కూల్స్ లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గురువుల స్థానానికి తగిన గౌరవం తీసుకొచ్చామని తెలిపారు. యువనేత, మంత్రి నారా లోకేశ్ చేపట్టిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యా వ్యవస్థలో నూతన శైలిని తీసుకొచ్చామన్నారు. చెప్పిన మాట చెప్పినట్టు అమలు చేసి డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీ ఇచ్చి గురువులను అవమానించారని జగన్ పై మండిపడ్డారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మందు దుకాణాల వద్ద కాపలా పెట్టారని విమర్శించారు. బయోమెట్రిక్ తోపాటు గురువులను వివిధ యాప్ లతో వేధించి విద్యార్థులకు చదువులను దూరం చేశారన్నారు. దీంతోపాటు డీఎస్సీ పేరిట నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు గురువుల స్థానానికి సముచిత స్థానం కల్పించామని స్పష్టం చేశారు.

# పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ళ పంపిణీ

- రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ అఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్ళ పంపిణీ
- 130 మంది బాలికలకు అందజేసిన రోటరీ ప్రతినిధులు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):తాడేపల్లి పట్టణ రూరల్ గ్రామాలకు చెందిన పలు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు 130 మంది బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి,రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్త సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు శెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ గవర్నర్ (3150) డాక్టర్ ఎస్ వి రామ్ ప్రసాద్ పాల్గొని సైకిళ్ళ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతపై బాలికలకు అవగాహన కల్పించారు. పేద విద్యార్థులు స్కూళ్లకు వెళ్లడానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో సైకిళ్లను పంపిణీ చేశామని అన్నారు .ప్రతి విద్యార్థిలక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకొనసాగించాలన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణ చంద్రరావు,బిజిఆర్ మైనింగ్ లిమిటెడ్ డైరెక్టర్ విసిరెడ్డి బాల కోటిరెడ్డి,పిడిజి లు తాళ్ల రాజ శేఖర్ రెడ్డి, రవి వడ్లమాని,రోటరీ క్లబ్ అఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు పంగలూరి కళ్యాణ్,సెక్రటరీ విసిరెడ్డి లక్ష్మి, సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ చక్రవర్తి రెడ్డి,రోటరీ క్లబ్ అఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజ శేఖర్,రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి కార్యదర్శి జెట్టి శ్రావణి, కోశాధికారి కావూరి వెంకట నగేష్,ప్రాజెక్ట్ చైర్మన్ మున్నంగి వివేకానంద రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ రావూరి రమేష్ బాబు,సుకుమార్ రెడ్డి, గోపు నాగ రాజేష్, కాట్రాగడ్డ శివన్నారాయ, జొన్న రాజేష్, చంద్ర ఓబులా రెడ్డి,తో పాటు సుమారుగా 40 మంది సభ్యులు పాల్గొన్నారు.

# ఎంవీఎస్ రత్నాకరశాస్త్రి ని సత్కరించిన బ్రాహ్మణ సేవా సమితి



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) రాష్ట్రసంగీత నాటక అకాడమీ డైరెక్టర్ గా ఎంవీఎస్ రత్నాకరశాస్త్రికి అవకాశం కల్పించిన మంత్రి నాదెండ్ల మనోహర్ కు బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గం ధన్యవాదాలు తెలిపుతు, రత్నాకరశాస్త్రిని సత్కరించారు. స్థానిక రామలింగేశ్వరపేట లోని,బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సంగీత నాటక అకాడమి డైరెక్టర్ పదవిని పొందిన, సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ రత్నాకర శాస్త్రి అభినందన సభను నిర్వహించారు. పోతావజుల పురుషోత్తమ శర్మ, సమావేశానికి స్వాగతం పలుకగా, సేవా సమితి సభ్యులు, ఎంవీఎస్ రత్నాకర్ శాస్త్రి సేవా దృక్పథాన్ని వివరించారు.తెనాలి ప్రాంతంలో, కళాకారుల ప్రయోజనాలకు ఎంవిఎస్ రత్నాకర్ శాస్త్రి సేవలు ఉపయోగపడాలన్న భావనను వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు సేవా సమితి కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది. అనంతరం రత్నాకరశాస్త్రిని సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రత్నాకరశాస్త్రి మాట్లాడుతు నాటకాడమీ డైరెక్టర్ గా తనకు అవకాశం కల్పించిన మంత్రి నాదెండ్ల మనోహర్, కు, మంచి పేరు తీసుకొచ్చేలా తమ వంతు సేవలు అందిస్తామన్నారు. ఇదే సమావేశంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని, హిందీ ఉపాధ్యాయిని కరవాది సరస్వతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విష్ణుభట్ల మణి కిషోర్, పెద్దిరాజు సత్యనారాయణ, త్రిపురారి భట్ల దత్తు, సిహెచ్ శ్రీనివాస్, అద్దేపల్లి మాధవశాస్త్రి, లక్కరాజు లక్ష్మణరావు, ఎం ఆదిశేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# హనీఫ్ మోడ్యూలర్ ఇంటీరియర్స్ ఏర్పాటు అభినందనీయం

- విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావురత్తయ్య



తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకునే విధంగా చిన్న తరహా పరిశ్రమను యువత ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని హనీఫ్ మోడ్యులర్ , ఇంటీరియర్స్, కబోర్డ్ వర్క్స్, సంస్థ ను ప్రారంభించిన సందర్భంగా,విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మండలంలోని పెదరావూరు గ్రామంలో షేక్ సుభాని నూతనంగా ఏర్పాటు చేసిన హనీఫ్ మోడ్యు లర్ ఇంటీరియల్ కబోర్డ్ వర్క్స్ చిన్నతరహా పరిశ్రమను, శుక్రవారం విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మారుతున్న పరిస్థితులు కనుగుణంగా, గృహ నిర్మాణాలకు ఇంటీరియల్ డెకరేషన్ కబోర్డ్స్ ను తయారు చేసే సంస్థను ఏర్పాటు చేసి, పదిమందికి ఉపాధి కల్పించే విధానం అభినంద నీయమని, గత పది సంవత్సరాలుగా తమ సంస్థతో అనుబంధం ఉన్న, సుభాని, ఇంటీరియల్ డెకరేషన్ తయారీ సంస్థను స్వయంగా ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మారోజు సీతారామయ్య, కొడాలి రవిబాబు, కొడాలి రమణ బాబు, ఎలవర్తి హరికృష్ణ, షేక్ సుభాని, షేక్ బాషా, షేక్ జాన్ సైదా, షేక్ ఆనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# టపాసులు పేలి టిడిపి కార్యకర్త మృతి

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) బ్రహ్మంగారి మఠం మండల పరిదిలోని రేకలకుంట పంచాయతీ బాగాదుపల్లె లో గత నెల 29వ తేదీన వినాయక చవితి సంధర్భంగా వినాయకుడిని ఊరేగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు టపాసులు పేలి కుమ్మితి పాలకొండయ్య (35)కు తీవ్రగాయాలయ్యాయి చికిత్స నిమిత్తం హుటాహుటిన 108అంబులెన్సు సహాయం తో బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచనల మేరకు కడప రిమ్స్ కు తరలించడం జరిగింది మెరుగైన చికిత్స కోసం తిరుపతి లోని రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి తరలించగా గత వారం రోజులు గా చికిత్స పొందుతూ దురదృష్టవశాత్తు శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు మృతిచెందిన వ్యక్తికి బార్య ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలుస్తుంది తమ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్నటువంటి వ్యక్తి మరణించడంతో వారి కుటుంబం లో తీవ్ర విశాధఛాయలు అలుముకున్నాయి, తమను ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య పిల్లలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నం వడ్డించి ప్రజలతో మమేకమయ్యారు. నియోజకవర్గములోని శ్రీనివాసరావుపేట 1వ లైన్, నల్లచెరువు 15వ లైన్, విద్యానగర్ 3వ లైన్ మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, స్థానిక భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "వినాయక చవితి పండుగ మన అందరికి ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం అనే సందేశాన్ని ఇస్తుంది. ఈ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని గణపతిని ప్రార్థిస్తున్నాను. గుంటూరు పశ్చిమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాను. ప్రజల ఆశలు నెరవేర్చడం, ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం తీసుకురావడం నా లక్ష్యమని, అన్నదానం అనేది అత్యుత్తమ దానం అని, ఈ తరహా సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా కలసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గణపతి ఆశీస్సులతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి ఇంటిలో ఆనందం నిండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలి

- బాపనయ్యనగర్ వారికి పట్టాలు ఇవ్వాలి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలతో పాటు గుంటూరు జిల్లా పల్నాడు పరిధిలోని బాపనయ్య నగర్ కుటుంబాల ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని మాల మహానాడు కమిటీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లింది. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ ఆధ్వర్యంలో కమిటీ బృందం అమరావతి సచివాలయంలో పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ సహా పలు శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులను కలిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు శాఖలలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు పేరుతో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు కేవలం 13,000 వేతనం మాత్రమే చెల్లిస్తుండగా, వారిని పర్మినెంట్ చేయకపోవడం వల్ల ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి శాశ్వత నియామకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం 12వ వార్డు బాపనయ్యనగర్‌లో సుమారు 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న 150 కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ భూమి మున్సిపాలిటీ పరిధిలోనే ఉందని అధికారులు చెబుతున్నా, పట్టాల విషయంలో నిర్ణయం తమ పరిధిలో లేదని స్థానిక మున్సిపల్ అధికారులు తప్పించుకుంటున్నారని కమిటీ సభ్యులు వివరించారు. వారి వినతిని విన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత జీవో ప్రకారం చర్యలు తీసుకుని క్రింది స్థాయి అధికారులతో మాట్లాడి త్వరలోనే పట్టాలు ఇచ్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శి మిట్ట సునీత కూడా పాల్గొన్నారు.

## ఇబ్రహీం ను సత్కరించిన టిడిపి నేతలు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీం ను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు నేతలు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు కూరపాటి మురళి రాజు, వెలగపాటి విలియం, వాకా మాధవరావు గౌడ్, జొన్నాదుల బాలకృష్ణ, అన్నం నాగబాబు, ఎండీ ఆరిఫ్, పేరం ఏడుకొండలు, షేక్ షకీల్, జొన్నాదుల వెంకట రామాంజనేయులు, చింతా వెంకటేశ్వరరావు, జి రమేష్, వడ్డేశ్వరం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా పారేపల్లి



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా పారేపల్లి మహేష్ నియమితులయ్యారు. శుక్రవారం మంగళగిరిలోని ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు నియామక ఉత్తర్వులు పారేపల్లి మహేష్ కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# "జ్యేష్ఠ రాజం - బ్రహ్మణాం" ప్రదమ పూజల ప్రమద నాయకుడు

- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): దైవారాధన.. పూజా కార్యక్రమాల్లోనే కాక ఈ జగత్తులోనే సర్వ శుభ కార్యాల ఆరంభంలో ప్రదమ పూజలందుకునే ప్రమద నాయకుడు – వినాయకుడని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వేనోళ్ళా స్తుతించారు. అందుకే సృష్టికి మూలాధారమైన వేద వేదాంగాలు సైతం ఆయనను, "జ్యేష్ఠ రాజం – బ్రహ్మణాం" అని ఘనంగా కీర్తించినట్లు ఆయన వెల్లడించారు. గుంటూరులో ఘనంగా జరుగుతున్న వినాయక చవితి వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విఘ్న నాయకుడికి విశిష్ట పూజలు నిర్వహించారు.

యంగ్ వన్స్ అసోసియేషన్ కన్వీనర్, గుంటూరు నగరపాలకసంస్థ కో ఆప్షన్ మెంబర్ ఆలా సాంబశివరావు ఆధ్వర్యంలో అరండల్‌పేట, కొత్తపేట సతీష్ ఫ్రెండ్స్ సర్కిల్, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ సతీష్ ఆధ్వర్యంలో స్థానిక వడ్డూరి వారి వీధి, శ్రీ కాణిపాక యూత్ ఆధ్వర్యంలో నల్లచెరువు 4వ లైను, క్లాసిక్ యూత్ ఆధ్వర్యంలో సంపత్ నగర్ రామాలయం గుడి, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చంద్రమౌళి నగర్ తదితర ప్రాంతాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఆది దంపతుల మానస పుత్రుడు, ఓంకార స్వరూపుడు, సర్వ కార్యాలను సిద్ధింపజేసే సర్వ దేవతా లక్షణ సమన్వితుడు సిద్ధి బుద్ధి వినాయకుడని పేర్కొన్నారు. సకల విఘ్నాలను శమింపజేసే విఘ్ననాయకుడని తెలిపారు. అందుకే "నిర్విఘ్నం కురుమే దేవ – సర్వ కార్యేషు సర్వదా" అని ఆయనను అందరూ ప్రార్థించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని వివరించారు.

విఘ్న నివారకుడే కాక వినాయకుడు విద్యా ప్రదాత కూడా అని లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. మన మంచి పనులకు మద్దతిచ్చి, మార్గ నిర్దేశం చేయడం ద్వారా మన జీవిత చక్రాన్ని సన్మార్గంలో ముందుకు నడిపిస్తాడన్నారు. ఇక ఆయన పేరున ఏటా జరిపే వినాయక చవితి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మనసులో సంపూర్ణ ఆత్మ విశ్వాసాన్ని నింపడమే కాక సమాజంలో ఐక్యతకు, సమసమానత్వ భావనకు, సర్వులలో భక్తి భావం పెంపొందించేందుకు చక్కగా ఉపకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వేడుకల ముగింపు సందర్భంగా పూర్తి శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావీయకుండా వినాయక నిమజ్జనాలు చేపట్టాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రతి ఒక్కరికీ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అరండల్‌పేట యంగ్ వన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యనమల పోతురాజు, కార్యదర్శి గుండిమెడ భవాని, ఉపాధ్యక్షుడు వీరంకి వెంకట రమణ, కొత్తపేట సతీష్ ఫ్రెండ్స్ సర్కిల్ దావులూరి జయ, పోతురాజు వెంకట్, పోతురాజు గజలక్ష్మి, పోతురాజు శ్రీ లక్ష్మి, బాజి, సుభాని, కె.సాయి, పి.సంతోష్, రోహిత్, నల్లచెరువు శ్రీ కాణిపాక యూత్ ప్రతినిధులు కె.అశోక్, చెన్నూరి రమాకాంత్, లేళ్ళ హరీష్, రాము, సీతయ్య, భాను, చంద్రమౌళినగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కె.నాగేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, బి.కొండయ్య, కె.నరసింహారావు, కె.బ్రహ్మం, సంపత్‌నగర్ క్లాసిక్ యూత్ సభ్యులు రామిశెట్టి రవికుమార్, మహేష్, వినయ్, మస్తాన్‌రావు, ప్రసాద్, శ్రీకాంత్, బండారు మణికంత, వెంకటేశ్వరరావు, కావటి పవన్, కావటి గోపి, కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, బీసీ నేత ఓర్చు శ్రీనివాసరావు, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపరలో 19వేల స్మార్ట్ రేషన్ కార్డులు



○ మంత్రి నాదెండ్లమనోహర్

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డు గ్రామంలో అత్యధికాగా 19వేల స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నామని, ఈ కార్డు ద్వారాఏ రేషన్ షాపులో అయినా, నెలపొడుపున రేషన్ పంపిణీ అందుబాటులో ఉంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొల్లిపర గౌడ కాలనీలో శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు ఆవశ్యకతను వివరించారు. అనంతరం మూడో విడత ఉచిత గ్యాస్ బుకింగ్ ద్వారా వచ్చిన, గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసిల్దార్ సిద్ధార్థ, కూటమి పార్టీలు నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగింపు



శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్): వినాయకచవితిని పురస్కరించుకుని ఆగస్టు 27న శ్రీశైలంలో ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా శ్రీ స్వామివారి యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించబడింది.

ఉత్సవాలన్నిరోజులూ రత్నగర్భ గణపతి స్వామివారికి, సాక్షి గణపతి స్వామివారికి, యాగశాలలో నెలకొల్పిన పంచలోహ వరసిద్ధి వినాయకస్వామివారికి, సాక్షి గణపతి ఆలయంలో ప్రతిష్ఠించిన మృత్తికా గణపతికి వ్రతకల్పపూర్వక పూజలు, మండపారాధనలు, ఉపనిషత్ పారాయణలు, జపానుష్ఠానాలు, గణపతి హోమం, సాయంకాల పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు తదితర ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. అనంతరం వసంతోత్సవం, అవబృథం కార్యక్రమాలు నిర్వహించగా, పంచలోహ వరసిద్ధి వినాయక స్వామివారికి మల్లికాగుండలో శాస్త్రోక్త స్నపనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగ క్రీడాకారుడికి ఏపీ ఎన్.జీజీఓ సంఘం ఆర్థిక సాయం




గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):అమెరికాలో జరగనున్న వరల్డ్ కప్ పారాసిట్టింగ్ వాలీబాల్ పోటీలలో పాల్గొనుటకు ఎంపికైన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న దివ్యాంగ క్రీడాకారుడు వి. విజయకుమార్ కు ఏపీ ఎన్. జీజీఓ సంఘం ఆర్థిక సహాయం అందించింది.

రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ చేతుల మీదుగా రూ. 10,000 చెక్కును విజయకుమార్ కు అందజేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తెచ్చే క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విజయకుమార్ అమెరికాలో జరుగనున్న పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## టెడ్ ఎక్స్ వేదిక పై చరిత్ర సృష్టించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. హైదరాబాదులోని సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక టెడ్ ఎక్స్ కార్యక్రమంలో ప్రసంగించి చరిత్ర సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ వేదికపై మాట్లాడిన తొలి రాజకీయ నాయకురాలిగా నిలిచారు.

"సానుకూల మనస్తత్వం సమాజాన్ని మార్చగలదు. సమస్యలను దాటుకొని ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరి లోపలే శక్తి ఉంది" అని గళ్ళా మాధవి తన ప్రసంగంలో స్పష్టం చేశారు. నేటి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా, స్ఫూర్తినిచ్చేలా ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రసంగించారు.

సమాజంలో మార్పు తీసుకురావడానికి రాజకీయాలు శక్తివంతమైన సాధనం అని, మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. "సమాజాన్ని సమగ్రంగా, సమానత్వంతో ముందుకు తీసుకెళ్లడం మన అందరి బాధ్యత అని , మార్పు మనలో నుంచే మొదలవ్వాలి" అంటూ ప్రేక్షకులను ఉత్సాహపరిచారు.

ఈ ప్రసంగం టెడ్ ఎక్స్ నిర్వాహకులు, విద్యార్థులు, పాల్గొన్న ప్రతిభావంతులను ఆకట్టుకుంది. రాజకీయ నాయకురాలిగా మాత్రమే కాకుండా, ఒక మోటివేషనల్ స్పీకర్ గా గళ్ళా మాధవి తన ముద్ర వేసిన ఈ సందర్భం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచారు.

## తురకపాలెం పరిస్థితులు పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా తురకపాలెంలో ఇటీవల నమోదైన మరణాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. క్యాంపులో అందుబాటులో ఉంచిన మందులు, పరీక్షా యంత్రాలు తదితరాల పై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. తాగునీరు కారణంగా వ్యాధి వస్తోందనే ప్రచారం వాస్తవం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఇవన్నీ కేవలం అపోహలేనని, నమ్మవద్దని సూచించారు. అరుదైన వ్యాధి కావడంతో సరైన అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి అపోహలు వ్యాప్తి చెందాయని పేర్కొన్నారు. తాను వైద్యుడిగా ప్రాక్టీస్ చేసిన సమయంలో కూడా ఇలాంటి వ్యాధిని చూడలేదని, పూర్తిస్థాయి పరీక్షలు పూర్తయ్యాకే ఖచ్చితమైన నివేదిక వెలువడుతుందని తెలిపారు. మెలియాయిడోసిస్ వ్యాధి వాతావరణంలో తేమ శాతం మార్పులు, విపరీత వర్షాలు వంటి కారణాలతో వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఈ బ్యాక్టీరియా చర్మం ద్వారా లేదా ఊపిరి పీల్చుకోవడం ద్వారా సోకుతుందని వివరించారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో, ముఖ్యంగా అధికంగా మద్యం సేవించే వారు, కిడ్నీ లేదా హృదయ సమస్యలతో బాధపడుతున్నవారిలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధికి నాలుగు రకాల యాంటీబయోటిక్స్ ఉపయోగపడతాయని చెప్పారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైతే ఆసుపత్రిలో చేర్పించి ప్రత్యేక వైద్యం అందిస్తామని మంత్రి తెలిపారు. మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ అంశంపై చర్చిస్తున్నారని తెలిపారు. తాను, ఎమ్మెల్యే రామాంజనేయులు కలిసి సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

## జీఎస్టీ స్లాబుల సరళీకరణ - పర్యాటక, సినిమా రంగాలకు ఊతం

○ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న నాలుగు స్లాబుల (5%, 12%, 18%, 28%) స్థానంలో ఇకపై కేవలం రెండు స్లాబులు ౦ 5% మరియు 18% మాత్రమే అమలులోకి వస్తాయని తద్వారా ప్రజలకు నేరుగా లాభం కలగనుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా సేవా ఆధారిత రంగాలైన పర్యాటక,సినిమాటోగ్రఫీ రంగాలపై ప్రభావం పడనుందన్నారు. వీటికి టాక్స్ తగ్గితే ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ప్రత్యేకించి హొటల్ రూమ్ టారిఫ్‌లు రూ. 7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 12% నుండి 5%కు తగ్గింపు ఉంటుందన్నారు. ఎకానమీ క్లాస్ విమాన టికెట్లపై +ూ 12% నుండి 5% కు తగ్గింపు ఉంటుందని, అదే విధంగా రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12-18% నుండి 5%కి తగ్గించబడుతుందన్నారు. అంతేగాక బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందని వెల్లడించారు. సినిమా రంగం విషయానికి వస్తే సినిమా టికెట్లు రూ. 100 లోపు ఉంటే 12% GST, రూ. 100 పైగా ఉంటే 18% +ూ కొనసాగుతుందన్నారు.. పాత 28% రేటు పూర్తిగా రద్దవుతుందన్నారు. సినిమా ప్రొడక్షన్ సేవలు అన్నీ 18% శ్లాబ్ పరిధిలోకి లోకి వస్తాయని, ఇది నిర్మాతలకు ఆర్థికంగా మేలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ జీఎస్టీ సంస్కరణలు సాధారణ ప్రజలకు చవకైన ప్రయాణం, తక్కువ ధరల్లో వినోదం కలిగించడమే కాకుండా, పర్యాటక రంగం, సినిమా రంగం బలోపేతం కావడానికి దోహదం చేస్తాయని వివరించారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మార్పులు "సులభ పన్ను - బలమైన ఆర్థిక వ్యవస్థ" లక్ష్యాన్ని చేరుకునే దిశగా పెద్ద అడుగుగా నిలుస్తాయని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## గుంటూరులో హైటెక్ దొంగ అరెస్ట్

○ ల్యాప్‌టాప్‌లు, నగదు, బంగారం స్వాధీనం



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు పగలగొట్టి, వాటిలోని విలువైన వస్తువులను దోచుకునే హైటెక్ దొంగను నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 6 ల్యాప్‌టాప్‌లు, రూ. 2 లక్షల నగదు, 11 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు నెలలో గుంటూరు నగరంలోని నల్లపాడు, నగరంపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా కార్ల అద్దాలు పగలగొట్టి దొంగతనాలు జరిగాయి. ఈ సంఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో పాటు ఘటన జరిగిన ప్రదేశాల పరిసరాలను పరిశీలిస్తూ పలు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. దర్యాప్తులో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం, గొరిజవోలు గ్రామానికి చెందిన జంగం బాజీ అనే వ్యక్తి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, గుంటూరులో మొత్తం 10 దొంగతనాలకు తానే పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. వీటిలో నల్లపాడు పరిధిలో 4, నగరంపాలెం పరిధిలో 3, పెదకాకానిలో 1, పాతగుంటూరులో 1, అరండల్‌పేటలో 1 కేసులు ఉన్నాయి. జంగం బాజీ గతంలో నరసరావుపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనిపై రౌడీ షీట్ కూడా తెరవబడింది. మత్తువ్యసనాలకు బానిసైన అతను యూట్యూబ్ వీడియోల ద్వారా కార్ల అద్దాలు ఎలా పగలగొట్టాలో నేర్చుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో బయటపడింది. నిందితుడిని పట్టుకోవడంలో నల్లపాడు సీఐ వంశీధర్, సీసీఎస్ సీఐ అనురాధ, ఎస్సై చల్ల. వాసు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు సాంబశివరావు, బిక్షు నాయక్, మస్తాన్ విశేష కృషి చేశారు. సౌత్ డిఎస్పీ భానోదయ మొత్తం దర్యాప్తుకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నేరస్తులు ఎంత తెలివిగా నేరాలు చేసి తప్పించుకోవాలనుకున్నా, పోలీసులు వారి జాడను తప్పక కనుగొంటారని హెచ్చరించారు. ఈ కేసులో చాకచక్యంగా పని చేసి నిందితుడిని పట్టుకున్న నల్లపాడు, నగరంపాలెం, సీసీఎస్ పోలీసుల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## రూ.17.55 లక్షలతో లక్ష్మీగణపతి అలంకారం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో కాణిపాక వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం రూ. 17.55లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో లక్ష్మీ గణపతి గా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కరెన్సీ నోట్లతో అలంకరించిన లక్ష్మీ గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కేవీవీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు లేళ్ల నరసింహారావు, గుండాల సాయి, పాశం శ్రీరామ్ తదితరులు పర్యవేక్షించారు.

## ఈ నెల 18 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు - నోటిఫికేషన్ విడుదల



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేసారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభ ప్రారంభం కానుండగా అదే రోజు ఉదయం 10 గంటలకు శాసనమండలి ప్రారంభం కానుంది. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనేది ఉభయ సభలు విడివిడిగా బీఏసీ సమావేశాలు నిర్వహించి నిర్ణయించనున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించేందుకు వివిధ బిల్లులకు, చట్ట సవరణలకు ఇప్పటికే మంత్రి వర్గ సమావేశాల్లో ఆమోదం తెలిపారు. సామజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది.

ఇందుకు అనుగుణంగా నిబంధనల రూపకల్పనకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని కూడా సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లోనే ఈ చట్టాన్ని తీసుకువస్తారా? లేదా? అనేది వేచి చూడాలి. అటు పులివెందుల ఎమ్మెల్యే జగన్?తో పాటు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలు చర్చించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. అసెంబ్లీకి వస్తే సభ్యులు అందరికీ సమాన అవకాశాలు ఇస్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్న వైఎస్సార్సీపీ సభ్యులు అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించి వాస్తవాలు బహిర్గతం చేసేందుకు సిద్ధమని సీఎం చంద్రబాబు సైతం సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామంటున్న వైఎస్సార్సీపీ అదే వాదనకు కట్టుబడి వుంటుందా? లేక అసెంబ్లీకి వస్తుందా అనేది వేచి చూడాలి.

అసెంబ్లీలో రాకపోకలకు నిబంధనలు: అసెంబ్లీ గేట్ 1 నుంచి మండలి చైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎంలకు మాత్రమే అనుమతి ఉంటుంది. గేట్ 2 నుంచి మంత్రులకు మాత్రమే అనుమతి ఇస్తారు. గేట్ 4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మండలి చైర్మన్, స్పీకర్, సీఎంలు వచ్చి వెళ్లే కారిడార్‌లోకి ఇతరులెవ్వరికీ అనుమతి లేదు. 4వ గేట్ గన్ పాయింట్ మినహా భద్రతా సిబ్బందిని అనుమతించేది లేదు. మంత్రులు, సభ్యుల పీఏలను అవసరం మేరకు మాత్రమే అనుమతి ఉంటుంది.

శాసనసభా వ్యవహారాలతో సంబంధం లేని ప్రభుత్వ విభాగాల సిబ్బందికి ప్రాంగణంలోకి అనుమతి లేదు. శాసనసభ, మండలిలోకి సభ్యులు ఎవరూ ఆయుధాలతో రాకూడదు. ఒక వేళ వచ్చినా అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్?లో డిపాజిట్ చేయాలి. ఆయుధాలు, లాఠీలు, ప్లకార్డులు, విజిల్స్ లాంటి వాటితో విధానపరిషత్ ప్రాంగణంలోకి ప్రవేశం లేదు. భద్రతా కారణాల రీత్యా సభ్యుల పీఏలు, వ్యక్తిగత సిబ్బందిని తీసుకురాకూడదు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ మినహా ఇతర చోట్ల మీడియా సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదు.

## జీఎస్టీ తగ్గింపుతో పౌల్ట్రీ పరిశ్రమకు మరింత ఊతం

○ గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానం

○ విజయనగరంలో కోళ్ళు చనిపోవడానికి బర్డ్ ఫ్లూ వ్యాధి కారణం కాదు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): పౌల్ట్రీ పరిశ్రమకు మరింత ఊతమిచ్చేందుకు జీఎస్టీని పాల ఉత్పత్తుల్లో జీరో స్థాయికి తగ్గించడం అదేవిధంగా పశువుల దాణా, వ్యవసాయ యాంత్రీకరణపై ఐదు శాతం స్లాబ్ కి తగ్గించటం వల్ల ఈ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వచ్చి పెట్టబడులు పెట్టె అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు తెలిపారు. శుక్రవారం పశు సంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయములో సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు వ్యాధుల కాలం - పశువులు మరియు కోళ్ళ సంరక్షణపై తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షులు డా.కె. సోమిరెడ్డి, ఉపాధ్యక్షులు టి. కుటుంబరావు లతో కలసి మాట్లాడుతూ మన రాష్ట్రం దేశంలో గేదెల సంఖ్యలో 6 వ స్థానంలో, గొర్రెల సంఖ్యలో 2 వ స్థానంలో, కోళ్ళ సంఖ్యలో 2 వ స్థానంలోనూ ఉందన్నారు. గ్రుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో, మాంస ఉత్పత్తిలో 4 వ స్థానంలో, పాల ఉత్పత్తిలో 5 వ స్థానంలో ఉన్నామన్నారు. సుమారు 25 లక్షల కుటుంబాలకు పశు సంవర్ధన రంగం జీవనోపాధి కల్పిస్తోందన్నారు. రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తిలో 12.17% వాటాతో రూ. 1.61లక్షల కోట్లు పశుగణ రంగం నుంచి లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాడి, కోళ్ళ పరిశ్రమకు కావలసిన సహాయ సహకారాలను అందిచడం వల్ల ఈ పురోభవృద్ధి సాధ్యమైందన్నారు.

కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి 15% వృద్ధి రేటు సాధించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. 50 శాతం రాయితీపై పశువుల దాణా, 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు, 85 శాతం రాయితీపై పశు బీమా, 70 నుండి 90 శాతం రాయితీపై గోకులాలు, 100 శాతం రాయితీపై బహు వార్షిక పశుగ్రాసాల సాగు వంటి వాటికి తోడ్పాటు అందిస్తోందన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని సైలేజిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జొన్న రకాల పశుగ్రాసం ఒకసారి విత్తితే, రెండు మూడు సార్లు రైతులు కోసుకునే లాగా రైతులు 25 శాతం చెల్లించి, 75 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ జొన్న సాగును రైతు తనకున్న పొలంలోని అర ఎకరంలో ఉచితంగా వేసుకోవచ్చన్నారు. రాబోయే కాలంలో ప్రతి మండలంలో 5 ఎకరాల్లో పశుగ్రాస నర్సరీలను ఏర్పాటు చేసి పశుగ్రాసాలను పండించి రైతులకు అందించేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు మూడు లక్షల ఎకరాల్లో పశుగ్రాసాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 85 శాతం సబ్సిడీతో పశుబీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ పథకాన్ని రైతులు మరింత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ రంగంలో మరింత ఉత్పాదకతను పెంచడానికి 70 నుండి 90 శాతం రాయితీపై గోకులం అనే పథకాన్ని నరేగా అనుసంధానంతో అమలు చేస్తున్నామన్నారు. కేవలం పెయ్య (ఆడ) దూడలు పుట్టే విధంగా లింగ నిర్ధారిత పశు వీర్య వినియోగాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా రైతులకు ఆర్థిక పరిపుష్టి కలగడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ వీర్యం ఖరీదుతో కూడుకున్నప్పటికి రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై సరఫరా చేస్తోందన్నారు. దీనివలన 90 శాతం ఖచ్చితత్వంతో పెయ్య దూడలు మాత్రమే జన్మిస్తాయన్నారు. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సహకారంతో ఒక్కొక్క వీర్య నాళికను రూ. 300/- లకు కొనుగోలు చేసి, 50 శాతం రాయితీతో రూ. 150/- లకే రైతులకు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9,326 కృత్రిమ గర్భధారణ కేంద్రాల ద్వారా పది లక్షల డోసులు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 104/108 అంబులెన్స్ ల తరహాలో పశుసంవర్ధక శాఖలో 340 సంచార పశు ఆరోగ్య సేవా వాహనాల ద్వారా రైతుల ఇంటివద్దనే పశు వైద్య సేవలను అందించడం జరుగుతోందన్నారు. రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకొని వారి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

పశువుల్లో మరియు కోళ్ళలో కాలానుగుణంగా వచ్చే వ్యాధులకు వ్యాధినిరోధక టీకాలు అందుబాటులో ఉంచి, రైతులకు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రైతులు జీవ భద్రతా విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో కోళ్ళు చనిపోవడానికి బర్డ్ ఫ్లూ వ్యాధి కారణం కాదని, విజయవాడ VBRI సంస్థ ధృవీకరించడం జరిగిందన్నారు. దీనికి కారణం ఇన్ క్లూజన్ బాడీ హెపటైటిస్ మరియు కొక్కెర వ్యాధి అని నిర్ధారించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 4 వ తేదీన పౌల్ట్రీ లేయర్స్ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించి, బర్డ్ ఫ్లూపై ప్రస్తుత పరిస్థితిని వివరించడం జరిగిందని మరియు అన్ని కోళ్ళ ఫారాల్లో జీవ భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని కోరడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులకు బర్డ్ ఫ్లూ వ్యాధి పై తగు సూచనలు చేసి, ఏవైనా సంఘటనలను జరిగిన వెంటనే ప్రధాన కార్యాలయానికి తెలియజేయమని ఆదేశాలు జారీ చేసామన్నారు.

రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమ మరింత ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. మున్సిపాలిటిలలో వీధి కుక్కల నియంత్రణకు 4 ఎన్.జి.ఓ.లతో అవగాహనా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.

యాంటి రేబీస్ టీకాలు రాష్ట్రంలోని అన్ని పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జన్యుపరంగా మెరుగైన జాతి పశువులను వృద్ధి చేయడంతో పాటు వట్టిపోయిన పశువులను నుండి కూడా మేలుజాతి దూడలను పునరుత్పత్తి చేయడానికి పిండ మార్పిడి విధానాన్ని అందుబాటులోకి తేవడం జరిగింది. తద్వారా రాష్ట్రంలో సగటు పాల ఉత్పత్తి పెరుగుతోందని, గతంతో పోల్చుకుంటే రాష్ట్రం లో పాల దిగుబడి మరింత పెరిగిందన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467